


శనివారం 4 ఏప్రిల్ 2026 పేజీలు : 12

# ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది



# సిఎం రేవంత్ రెడ్డి సభకు పకడ్బందీ ఏర్పాట్లు



## ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



ఆదిలాబాద్ జిల్లా బజార్‌హ త్నూర్ మండలం పిప్రి గ్రామం లో ఈనెల 6న రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పక డ్బందీ ఏర్పాట్లు చేయాలని జి ల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభు త్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, స్థానిక శాసనసభ్యుడు అనిల్ జాదవ్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా తదిత రులతో కలిసి సభా ప్రాంగణా న్ని పరిశీలించారు.



# పార్టీ జెండా మోసి కష్టపడ్డ కార్యకర్తలకే పదవులు రావడం లేదు

మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ సాగర్ రావు

సంచలనంగా మారిన మాటలు




# సింగరేణిలో గిరిజన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

సీఎండీని కలిసి వినతిపత్రం అందజేసిన ఎస్టీ అసోసియేషన్ నేతలు



## జర్నలిస్టుల సమస్యలను పరిష్కరిస్తా:

**కలెక్టర్ రాజర్షి షా**

**వినతి పత్రాన్ని అందజే సిన టీ.ఎస్.జె యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల్ అనిల్ కుమార్ జిల్లా నాయకులు.**

**అదిలాబాద్ జిల్లా నూతన కమిటీ ఎన్నిక.**

**అదిలాబాద్ :** తెలంగాణ స్టేట్ జర్నలిస్ట్స్ యూనియన్(టీ.ఎస్.జె.యు)జిల్లా నూతనంగా ఎన్నుకోబ డిన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సమావేశ కార్యాలయంలో కలెక్టర్ రాజర్షి షా ను మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రాన్నీ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ నూతనంగా ఎన్నుకొబడిన జిల్లా అధ్యక్షుడు రాగం సుభాష్,ప్రధాన కార్యదర్శి మేడపట్ల సాయన్న,ఉపాధ్య క్షులు పసుపుల స్వామిలకు శుభాకాంక్షలు తెలియజే శారు.ఈ సందర్భంగా యూని యన్ నాయకులు జర్నలిస్టు లు ఎదుర్కొంటున్న సమస్య లను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు.ఇందులో ప్రధానంగా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయడంతో పాటు హెల్త్ కార్డులు అన్ని ప్రైవేటు ఆసు పత్రులలో చెల్లుబాటు అయ్యే విధంగా చూడాలని,అర్హులైన జర్నలిస్టుల అందరికీ ఇల్లు, ఇంటి స్థలాలు ఇవ్వవలసింది గా కోరారు.దీనిలో భాగంగా జర్నలిస్టులపై దాడులు జరు గుతున్న సందర్భంలో అటాక్స్ కమిటీని జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసి రక్షణ కల్పించా ల్సిందిగా విజ్ఞప్తి చేశారు.దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సమస్యల పరిష్కారా నికి చొరవ చూపుతామని వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తాను అని బరోసా ఇచ్చారు.యూనియన్ కోశాధికారి అమృత్,ఓకే ప్రచార కార్యదర్శి మిలింద్, యూనియన్ గౌరవ అధ్యక్షు లు నరేష్ కదం,సహాయ కార్యదర్శి ఆర్కసంతోష్ తో పాటు మిగతా సభ్యులు దీపక్ ఎమ్ముర్లవార్,అనిల్ పవర్,అడ్డిగం మోహన్,శంకర్ తదితరులు ఉన్నారు.

## నిజామాబాద్ లో లవ్ స్టోరీ...

## వరుడు గ్రేట్ శాక్రిఫైజ్

**నిజామాబాద్ :** నిజామాబాద్ జిల్లా నవీపేట మండలంలోని ఆ కళ్యాణ మండపం పెళ్లి సందడితో కళకళలాడుతోంది. బంధుమిత్రుల కోలాహలం, మంగళ వాయిద్యాల హోరు మధ్య వధువు పల్లవి , వరుడు వేణుగోపాల్ పెళ్లి పీటల మీద కూర్చున్నారు. పండితులు మంత్రోచ్ఛారణలు చేస్తూ పెళ్లి తంతును నడిపిస్తున్నారు. జీలకర్ర బెల్లం కార్యక్రమం పూర్తయ్యింది. ఇక ప్రధాన ఘట్టమైన మాంగల్య ధారణ సమయం రానే వచ్చింది. పెళ్లికొడుకు వేణుగోపాల్ చిరునవ్వుతో తాళిని పల్లవి మెడలో కట్టబోయాడు.సరిగ్గా అదే క్షణంలో.. కాలం ఆగిపోయినట్లుగా పల్లవి ఒక్కసారిగా వద్దు.. ఈ పెళ్లి నాకు ఇష్టం లేదు! అని గట్టిగా అరిచింది. ఆ ఒక్క మాటతో పెళ్లి పందిరంతా నిశ్శబ్దం అలుముకుంది. అప్పటివరకు సంతోషంగా ఉన్న బంధువుల ముఖాల్లో ఒక్కసారిగా ఆందోళన, అయోమయం నెలకొన్నాయి. పల్లవి కన్నీళ్లతో తన మనసులోని నిజాన్ని అందరి ముందూ బయటపెట్టింది. తాను వేరే కులానికి చెందిన వ్యక్తిని ప్రేమిస్తున్నానని, ఇంట్లో చెబితే ఎక్కడ ఒప్పుకోరో అన్న భయంతో ఇంతకాలం మౌనంగా ఉన్నానని నిజాయితీగా ఒప్పేసుకుంది.ఈ మాట వినగానే పల్లవి తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. బంధువులు ఆమెను ఒప్పించే ప్రయత్నం చేశారు. ఇప్పుడు పెళ్లి ఆగిపోతే పరువు పోతుంది, కాపురం మొదలుపెట్టాక అంతా సర్దుకుంటుంది అని నచ్చజెప్పారు. కానీ పల్లవి 58తన నిర్ణయానికి కట్టుబడింది. తనని ప్రేమించిన వాడికి కాకుండా మరొకరికి భార్యగా కాలేనని తెగేసి చెప్పింది. పరువు కోసం ఒక నిరర్థకమైన బంధంలో బందీ కావడానికి ఆమె నిరాకరించింది.అక్కడ అందరూ ఆశ్చర్యపోయే మరో దృశ్యం ఆవిష్కృతమైంది. తన మెడలో తాళి కట్టాల్సిన అమ్మాయి అలా చెప్పడంతో సాధారణంగా ఏ వరుడైనా అవమానంగా భావించి గొడవ చేస్తాడు. కానీ వేణుగోపాల్ సంస్కారం ముందు అందరూ తలవంచాల్సిందే. పల్లవి బాధను, ఆమె నిజాయితీని అతను అర్థం చేసుకున్నాడు. నాపై ప్రేమ లేని అమ్మాయిని బలవంతంగా పెళ్లి చేసుకొని, ఇద్దరి జీవితాలను నాశనం చేయడం నాకు ఇష్టం లేదు. ఆమె ఇష్టాన్నే నేను గౌరవిస్తాను అని ప్రకటించి అందరినీ ఆశ్చర్యపరిచాడు.ఘటన సినిమాల్లో వచ్చే క్లైమాక్స్ లా అనిపించినా, వేణుగోపాల్ చూపించిన ఆ పరిణతికి అక్కడున్న వారంతా ఫిదా అయిపోయారు. ఆ గొడవలో ఆమెను విమర్శించకుండా, ఒక ప్రాణం విలువ తెలిసిన మనిషిగా అతను పెళ్లి రద్దుకు అంగీకరించాడు. చివరికి బంధువులు కూడా చేసేదేమీ లేక పెళ్లిని రద్దు చేసుకున్నారు. ఒకవైపు తన ప్రేమ కోసం సాహసం చేసిన వధువు పల్లవి, మరోవైపు తనను కాదన్న అమ్మాయి వ్యక్తిత్వాన్ని గౌరవించిన వరుడు వేణుగోపాల్.. వీరిద్దరి నిర్ణయాలు సమాజంలో ఒక కొత్త చర్చకు దారితీశాయి. ప్రేమ, పెళ్లి అనేవి బలవంతంగా రుద్దేవి కావని, అవగాహనతో కూడినవని ఈ సంఘటన మరోసారి నిరూపించింది.

# కవిత పార్టీ పేరు టీఆర్ ఎస్సా...

**హైదరాబాద్ :** టీఆర్ఎస్... ఈ పేరుతో తెలంగాణకు ప్రత్యేకమైన అటాచ్మెంట్ ఉంది. తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో ప్రత్యేక పార్టీ పెట్టి ప్రత్యేక రాష్ట్రం కోసం కేసీఆర్ చేసిన పోరాటాలను కథల కథలుగా చెప్పుకుంటారు తెలంగాణ ప్రజలు. లేటెస్ట్ పాలిటిక్స్‌లో చాలా పార్టీలకు టీఆర్ఎస్ రోల్ మోడల్. ప్రత్యేక రాష్ట్ర సాధించిన పార్టీగా టీఆర్ఎస్‌కు ప్రజల గుండెల్లో ప్రత్యేక స్థానం ఉంది. అయితే పార్టీని వేరే రాష్ట్రాల్లో విస్తరించాలనే ఆలోచనతో తెలంగాణ రాష్ట్ర సమితిని, భారత రాష్ట్ర సమితిగా మార్చి సరికొత్త నినాదాన్ని అందుకున్నారు కేసీఆర్. తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఓడిపోయారు. ఇప్పుడు తన కుమార్తె కవిత టీఆర్ఎస్ పేరుతో కొత్త పార్టీ పెట్టాలని ఆలోచన చేస్తున్నట్టు కనిపిస్తోంది. శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె చేసిన కామెంట్స్ సంచలనంగా మారుతున్నాయి. బంజారాహిల్స్‌లోని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తన కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించి కీలక వ్యాఖ్యలు చేశారు. ఆమె సమావేశం పెట్టింది ప్రైవేటు విద్యాసంస్థల ఫీజుల దోపిడీపై అయినా సరే రాజకీయంగా కూడా కొన్ని కామెంట్స్ చేయడం సంచలనంగా మారింది. తన పార్టీ గురించి మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానంగా టీఆర్ఎస్ పార్టీ ఇప్పుడు అందుబాటులో ఉందని, దాన్ని ఎవరైనా పెట్టుకోవచ్చని అన్నారు. తన పార్టీ ప్రొఫెసర్ జయశంకర్ సిద్ధాంతాల మేరకే నడుస్తుందని చెప్పారు. తమకు ఇతర రాష్ట్రాల సిద్ధాంతకర్తలు అవసరం లేదని స్పష్టం చేశారు. టీఆర్ఎస్ ఫ్రీ అయిందని చెప్పడం వెనుక కవిత పార్టీ పేరు అదే అయి ఉంటుందని ప్రచారం మొదలైంది. ఈ నెలాఖరున పార్టీ పేరు అజెండా ప్రకటిస్తానంటూ ఆమె చెప్పుకొచ్చారు. ఈ పేరును వదిలేసిన బీఆర్ఎస్ నుంచి ఎలాంటి రియాక్షన్ వస్తుంది. ప్రజల్లో వచ్చే స్పందన ఏలా ఉంటుందనే విషయాల గురించి తెలుసుకునేందుకు మీడియా సమావేశంలో కవిత ఇలాంటి కామెంట్స్ చేసి ఉంటారని విశ్లేషకులు అంటున్నారు.

## రేవంత్ ఎక్కడికి వెళ్తే అక్కడ కాంగ్రెస్ ఖతమే

## కొడంగల్ లో హరీష్ రావు పర్యటన

**రంగారెడ్డి :** కొడంగల్లో మాజీ మంత్రి హరీశ్రావు శుక్రవారం పర్యటించారు. హరీష్క రావు మాట్లాడుతూ తండాలను గ్రామపంచాయతీలు చేసిన ఘనత కేసీఆర్దే. మార్కెట్ కమిటీల్లో రిజర్వేషన్లు తెచ్చాం. ఎస్సీ, ఎస్టీల కేటాయింపులు రూ.2731 కోట్లు. ఖర్చు చేసింది కేవలం రూ.50 కోట్లేనని అన్నారు. సేవాలాల్ కార్పొరేషన్కు రూ.100 కోట్లు కేటాయించారు. రుపాయి కూడా విడుదల చేయలేదు. లగచర్ల రైతులను జైల్లో పెట్టిన ఘనత రేవంత్దే. కేరళ వెళ్లి 6 గ్యారంటీలు అమలు చేశామని చెప్తున్నారు. తెలంగాణలో 6 గ్యారంటీలు అమలౌతున్నట్టు నిరూపిస్తావా. 100శాతం రుణమాఫీ అయినట్టు కొడంగల్లో నిరూపిస్తావా. రేవంత్ ఎక్కడికి వెళ్తే అక్కడ కాంగ్రెస్ ఖతమేనని అన్నారు. ఈరోజు వరకు లంబాడీలకు కాంగ్రెస్ పార్టీ మంత్రి పదవి ఇవ్వలేదు. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ చేశారు.. డిక్లరేషన్ ఘనం, ఆచరణ శూన్యం . కాంగ్రెస్ ప్రభుత్వం ఈ రెండున్నర సంవత్సరాలలో ఎస్టీలకు, ఎస్టీ కార్పొరేషన్కు రూ.2730 కోట్లు పెట్టి ఖర్చు మాత్రం రూ. 50 కోట్లు పెట్టారు. ఒక్క ఎస్సీకి, ఎస్టీకి కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయలేదు. దీన్నిబట్టే ఎస్టీలను కాంగ్రెస్ ఎంత చిన్న చూపు చూస్తుందో అర్థం అవుతుందిని అన్నారు. బీఆర్ఎస్ ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్లు ఇచ్చింది, తండాలను గ్రామపంచాయితీ చేసింది, మార్కెట్ కమిటీ రిజర్వేషన్ ఇచ్చాము, వైన్ షాప్ రిజర్వేషన్ ఇచ్చాము, వందల, వేల కోట్ల రూపాయలు సహకారం అందించామని అన్నారు.

## కనకాపూర్ లో గాంజా గస్తీ దుకాణాల్లో తనిఖీలు




**లక్ష్మణచాంద, ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)** నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు నిర్మల్ జిల్లా లో నిర్వహిస్తున్న గాంజా గస్తీ కార్యక్రమం లో భాగంగా లక్ష్మణచాంద మండలంలోని కనకాపూర్ గ్రామంలో శుక్రవారం రోజున ఎస్సై శ్రావణి పోలీసులతో కలిసి పాన్ షాపు, కిరాణా షాపులలో ఆకస్మికంగా విస్తృత తనిఖీలను నిర్వహించారు. అందులో భాగంగా ఎవరైనా గాంజా అమ్మినట్టు మరియు డ్రగ్స్ సప్లై చేసినట్టు తెలిసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. కనకాపూర్ లో గాంజా గస్తి కార్యక్రమంలో భాగంగా కొంతమంది యువకుల తో కలిసి అవేర్నెస్ ప్రోగ్రాంను నిర్వహించారు. తెలిసి తెలియని వయసులో మత్తుకు బానిసై తమ జీవితాన్ని నాశనం చేసుకోవద్దని ఎస్సై యువతకు తెలిపారు. గాంజా మరియు డ్రగ్స్ గురించి ఎటువంటి సమాచారం ఉన్న పోలీసులకు సమాచారం అంది వ్వాలని అన్నారు.

# మైనార్టీలే గెలుపు డిసైడ్...

**తిరువనంతపురం :** కేరళ జనాభాలో ముస్లింలు సుమారు 26 శాతం, క్రైస్తవులు సుమారు 18 శాతం... కలిపి దాదాపు 45 శాతం పైగా ఉన్నారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో ఎన్నికలు తరచుగా హిందూ-ముస్లిం ధ్రువీకరణ చుట్టూ తిరుగుతుంటే, కేరళలో మాత్రం ఈ రెండు మైనారిటీ వర్గాల మొగ్గు ఎటువైపు ఉంటే ఆ కూటమి అధికార పీఠాన్ని అధిరోహిస్తుంది. దశాబ్దాలుగా యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ కు ఈ వర్గాలే కొండంత అండగా ఉంటూ వస్తున్నాయి. ముఖ్యంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ వంటి పార్టీలు కాంగ్రెస్ కూటమిలో ఉండటం వల్ల ముస్లిం ఓట్లు గంపగుత్తగా యూడీఎఫ్‌కే పడేవి.ఉత్తర కేరళలోని మలప్పురం , వయనాడ్ జిల్లాలు మైనారిటీ రాజకీయాలకు కేంద్రబిందువులు. మలప్పురంలో ముస్లిం జనాభా అధికంగా ఉండటంతో ఇక్కడ ముస్లిం లీగ్ తిరుగులేని శక్తిగా ఎదిగింది. అలాగే వయనాడ్ వంటి చోట్ల ముస్లిం, క్రైస్తవ ఓటర్ల కలయిక అభ్యర్థుల గెలుపోటములను శాసిస్తుంది. ఈ జిల్లాల్లో మెజారిటీ స్థానాలను సాధించకుండా ఏ కూటమి కూడా తిరువనంతపురంలో ప్రభుత్వం ఏర్పాటు చేయడం అసాధ్యం. గత ఎన్నికల్లో రాహుల్ గాంధీ వయనాడ్ నుండి పోటీ చేయడం కూడా ఈ మైనారిటీ సమీకరణాలను దృష్టిలో ఉంచుకుని చేసిన వ్యూహమే. ప్రస్తుతం ప్రియాంకాగాంధీ వయనాడ్ ఎంపీగా ఉన్నారు. గతంలో మైనారిటీ ఓట్లు కేవలం కాంగ్రెస్ సొత్తని భావించేవారు, కానీ ఇటీవలి కాలంలో ఎల్డీఎఫ్ ఈ కోటలోకి చొచ్చుకెళ్లింది. మతతత్వ శక్తులను అడ్డుకోగల ఏకైక శక్తి కమ్యూనిస్టులేననే ప్రచారంతో ముస్లిం యువతను ఎల్డీఎఫ్ ఆకట్టుకుంది. అలాగే కేరళ కాంగ్రెస్ ఎం వంటి క్రైస్తవ ప్రాధాన్యత గల పార్టీని తమ కూటమిలోకి చేర్చుకోవడం ద్వారా మధ్య కేరళలోని క్రైస్తవ ఓటు బ్యాంకులో ఎల్డీఎఫ్ పట్టు సాధించింది. 2021లో ఎల్డీఎఫ్ వరుసగా రెండోసారి గెలవడానికి ఈ మైనారిటీ ఓట్ల చీలిక , మళ్లింపు ప్రధాన కారణం.ఒకప్పుడు కాంగ్రెస్‌కు వెన్నెముకలా ఉన్న క్రైస్తవ ఓటర్లలో ఇప్పుడు స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. చర్చిల్లో ఉన్న వివిధ వర్గాల మధ్య ఉన్న అంతర్గత సమస్యలు వారి ఓటింగ్ సరళిని ప్రభావితం చేస్తున్నాయి. జేకోబైట్ చర్చి వంటి వర్గాలు ఎల్డీఎఫ్‌కు మద్దతు తెలపడం యూడీఎఫ్‌కు గట్టి దెబ్బ.

# పార్టీ జెండా మోసి కష్టపడ్డ కార్యకర్తలకే పదవులు రావడం లేదు

**మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ సాగర్ రావు సంచలనంగా మారిన మాటలు**

**మంచిర్యాల, 3, ఏప్రిల్ ( ప్రజా జ్యోతి ):**మంచిర్యాల జిల్లా లోని క్యాతనపల్లి ఎంఎన్ఆర్ గార్డెన్ లో చాలా కాలం తర్వాత మంచిర్యాల జిల్లా స్థాయి కాంగ్రెస్ సర్వసభ్య సమావేశాన్ని ఘనంగా నిర్వహించారు. అయితే ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ సాగర్ రావు సభా ముఖంగా మాట్లాడిన అంశాలు సంచలనంగా మారాయి. ఈ సమావేశం లో ముఖ్య తిథులుగా హాజరైన టీపీసీసీ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్, కార్మిక మైనింగ్ ఉపాధి శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి,జిల్లా ఇంచార్జ్.మంత్రి జూపల్లి కృష్ణారావు తోపాటు ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావాద్,మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,ఎమ్మెల్సీ దండే విఠల్,మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్,మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ రెడ్డి లు పాల్గొని మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గ సభ్యులతో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ ప్రమాణ స్వీకారం చేపించారు. ఇంతవరకు బాగానే ఉంది. ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్సాగర్ రావు, అలాగే చెన్నూరు ఎమ్మెల్యే, రాష్ట్ర గనులు కార్మిక శాఖ మంత్ర గడ్డం వివేక్ వెంకటస్వామి వివేక్ లు నిండు సభలో చేసిన కామెంట్ కామెంట్స్ అందర్నీ ఆలోచింపచేసాయి. మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడిన మాటలు ఈ విధంగా ఉన్నాయి.కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త పని చేయాలని, కాంగ్రెస్ పార్టీలో సీనియార్టీ ప్రతిపాదికనే పదవులు ఇస్తున్నారన్నారు. కాంగ్రెస్ పార్టీ కోసం పని చేసే వ్యక్తులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. అన్ని పార్టీల్లో గ్రూప్ రాజకీయాలు ఉంటాయని, .అవి అన్ని పక్కన పెట్టీ పార్టీ కోసం పని చేయాలని సూచించారు. బిఆర్ఎస్ పార్టీ పది ఏండ్లు చేసిన అరాచకాలు కాంగ్రెస్ పార్టీ ఎత్తి చూపింది. అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రతి పక్షాలు చేస్తున్న ఆరోపణల ను తిప్పి కొట్టాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మంచిర్యాల జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణ రావు కూడా గత ప్రభుత్వం లో జరిగిన అన్యాయలను వాస్తవాలను ప్రజలకు తెలియజేయాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపు నిచ్చారు. రాహుల్ గాంధీ సోనియాగాంధీ ఫ్యామిలీ త్యాగాల పార్టీ. కాంగ్రెస్ పార్టీ కోసం ఇందిరా గాంధీ,రాజీవ్ గాంధీ ప్రాణాలు అర్పించారని ప్రధాన మంత్రి పదవి కూడా చేపట్టలేదని అంటూ, పార్టీలో కష్టపడ్డ వారికి పదవులు రావాలి..పార్టీ గుర్తింపు ఇస్తుందని, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడాలన్నారు. ఇక పిసిసి ప్రెసిడెంట్ మహేశ్ కుమార్ గౌడ్ కామెంట్స్ ప్రకారం చూస్తే,బిఆర్ఎస్ నిర్బంధ పాలనలో కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు చాలా ఇబ్బందులు పడ్డారు.అక్రమ కేసులు అనుభవించారని, కార్యక్తల వల్లే ఈ రోజు కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చిందని దేశం లో కాంగ్రెస్ పార్టీకి గొప్ప చరిత్ర ఉందని, బీద ప్రజల సంక్షమం కోసం కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్న విషయాన్ని నాయకులు కార్యకర్తలు విస్మరించరాదని ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరడం జరిగింది. ఇంతవరకు బాగానే ఉంది. ఇక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సీనియర్ నాయకులు, ప్రస్తుత మంచిర్యాల నియోజకవర్గం ఎమ్మెల్యే కొకరాల ప్రేమ్సాగర్ రావు, ఇటీవల ఏర్పాటు చేసిన మంచిర్యాల జిల్లా నూతన కార్యవర్గం విషయంలో అసంతృప్తి వ్యక్తం చేస్తూ మాట్లాడినట్టుగా అర్థమైంది. ఆయన మాట్లాడిన వివరాల ప్రకారం. సభా వేదిక మీద ఉన్న పిసిసి, జిల్లా ఇన్చార్జి మంత్రి, జిల్లా మంత్రి, పేర్లతోపాటు మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పేరు, రాష్ట్ర ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రెటరీ, ఇతర ప్రజా ప్రతినిధుల ముఖ్య మైన వారిని కూడా ప్రస్తావించి గౌరవించారు. అయితే తాజాగా ఏర్పాటుచేసిన మంచిర్యాల జిల్లా డిసిసి జిల్లా కార్యవర్గం విషయంలో కష్టపడ్డ వారికి, సీనియర్లకు పదవులు



రాలేదని సభాముఖంగా చెప్పడం ఇక్కడ ముఖ్యమైన అంశం. పిసిసి అధ్యక్షుడు అయిన తర్వాత, చాలా రోజుల తర్వాత మంచిర్యాల జిల్లాలో కొత్తగా కార్యవర్గం ఏర్పాటు అయిందని, ఈ సందర్భంగా అధ్యక్షుల వారికి ఒక మాట చెబుతున్నానని, ఇది సందేశం అనుకోండి, నాకు ఇక్కడ ఉన్న ఇబ్బంది అనుకోండి, వాస్తవాలు చెప్పదలుచుకున్నాను, ఒక్కటి గుర్తు పెట్టుకోండి మీరు.. ప్రభుత్వం వేరు, పార్టీ వేరు ఎప్పుడైనా కూడా ప్రభుత్వం పరంగా ఎమ్మెల్యేగా, అవసరాలు, సంఖ్య ఉంటేనే ప్రభుత్వ నడుస్తుంది, కానీ పార్టీ పరంగా కార్యవర్గానికి సంబంధించి విషయాలు చెప్పారు. ఈ రాష్ట్రంలో పది సంవత్సరాల రాక్షస పాలన అనుభవించామని, కార్యకర్తలు తిండి ఉన్నా లేకున్నా, ఉపవాసం ఉండి, ఒక పూట తిని, కాంగ్రెస్ పార్టీ జెండా పట్టుకొని పార్టీ కోసం తిరిగింద్రు అదేవిధంగా వాళ్ల పరిస్థితి ఒక రకంగా ఉంటే నా మీదనే గతంలోని ప్రభుత్వం కేసులు పెట్టారని, అలాగే నాయకుల కార్యకర్తల మీద చాలా కేసులు ఉన్నాయని, అయితే కేసులకు భయపడటం లేదని ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావు అన్నారు. అయితే పార్టీ కోసం కార్యవర్గాన్ని ఏర్పాటు చేయడం తప్పనిసరి పరిస్థితి కాదనడం లేదని, పార్టీ జెండా మోస్తూ పదుల సంవత్సరాలుగా కష్టాలు అనుభవించి ఇప్పటికీ కష్టపడుతున్న కార్యకర్తలకు సరియైన సముచిత స్థానం ఇచ్చి గౌరవించకపోతే వచ్చే ఎన్నికల్లో పార్టీ పరిస్థితి ఏమిటి అనేది గుర్తుపెట్టుకోమని ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు పరోక్షంగా హింట్ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే కార్యకర్తలని కార్యకర్తలని కాంగ్రెస్ పార్టీ అని, కార్యకర్తలు పని చేస్తేనే ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది వస్తుందని, కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించకపోతే మాత్రం సమస్య స్థానం ఇవ్వకపోతే మాత్రం పార్టీ అధికారంలోకి రావడం కష్టమని తేల్చి చెప్పారు. ఇక్కడ ఒకటి గర్వంగా చెబుతున్నానని, మంచిర్యాల జిల్లా అధ్యక్షురాలుగా సురేఖ ఉన్నప్పుడు ఆమె ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లాలో ఉన్న మూడు ఎమ్మెల్యే సీట్లు, అదేవిధంగా ఖానాపూర్ లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలవడం జరిగిందని, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని మిగతా చెట్లలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని అలా ఎందుకు జరిగిందో ఆలోచిస్తే మీకే అర్థమవుతుందని ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావు పరోక్ష హెచ్చరికలు చేశారు. పిసిసి అధ్యక్షుల వారిని అదే విధంగా జిల్లా అధ్యక్షుల వారిని కోరేది ఒకటే, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో కష్టపడే కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించాలని లేకుంటే ఇక్కడ పార్టీ మునుగడ కష్టమని సంకేతాలతో ప్రేమ్ సాగర్ రావు రెండుగా ఉన్న సభా వేదిక పై నిలబడి మాట్లాడిన మాటలు సంచలనంగా మారాయని చెప్పక తప్పదు. ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాటల పేరును గమనిస్తే ఇటీవల తాజాగా ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గ విషయంలో ఎమ్మెల్యే ప్రేమ్సాగర్ రావు స్పష్టంగా తన అసంతృప్తిని వ్యక్తం చేసినట్టు స్పష్టమైనది. ఇక ఈ విషయంలో ఎలాంటి నిర్ణయాలు జరుగుతాయో, జిల్లా కార్యవర్గంలో మార్పులు చేర్పులు జరిగి ప్రేమ సహకార రావు సలహా ఇచ్చినట్లు కష్టపడ్డ కార్యకర్తలకు చోటు దక్కుతుందా లేదా వేచి చూడాలి.

## సీఎం రిలీఫ్ ఫండ్" చెక్కు" పంపిణీచేసిన కెరమెరి సర్పంచ్ ఆనందరావు



**కెరమెరి ఏప్రిల్ 3:ప్రజా జ్యోతి** మండల కేంద్రానికి చెందిన గిత్తే కిరణ్ కుమార్ కు మంజూరైనా సీఎం రిలీఫ్ ఫండ్ "చెక్కును" కెరమెరి సర్పంచ్ పెందోర్ ఆనందరావు గారు శుక్రవారం లబ్ధిదారునికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మీ గారి సహకారంతో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు మంజూరైందని తెలిపారు. నిరుపేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో అండగా సహాయం చేస్తుంది అన్నారు ఇంకాఎవరైనా ఆసుపత్రిలో చికిత్స చేయించి ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వికార్ అహ్మద్, తిరుపతి ఉన్నారు.

## అలుపెరుగని పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య : జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య





**మంచిర్యాల, 3,ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం జరిగిన తెలంగాణ సాయుధ ఉద్యమం లో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన దొడ్డి కొమురయ్య జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి, జిల్లా షెడ్యూల్డ్ కులముల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గా ప్రసాద్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సురేఖ, వివిధ కుల సంఘాల ప్రతినిధులతో కలిసి దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతిని వెలిగించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిజాం పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం కోసం, భూమి--భుక్తి--విముక్తి సాధన కోసం దొడ్డి కొమురయ్య వీరోచితంగా పోరాటం చేశారని పేర్కొన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చైతన్యం కల్పించి ఉద్యమాన్ని బలోపేతం చేసిన మహనీయుడని కొనియాడారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం ఆయన చేసిన త్యాగాలు యువతకు మార్గదర్శకమని, దేశ స్వాతంత్రం మరియు ప్రజల సంక్షేమం కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో వసతి గృహాల సంక్షేమ అధికారులు, యాదవ, కురుమ కుల సంఘాల ప్రతినిధులు, ఇతర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సింగరేణిలో గిరిజన ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

## సీఎండీని కలిసి వినతిపత్రం అందజేసిన ఎస్టీ అసోసియేషన్ నేతలు




**జైపూర్ ఏప్రిల్ 3 ప్రజా జ్యోతి జైపూర్ :** సింగరేణి సంస్థలో గిరిజన ఉద్యోగులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను తక్షణమే పరిష్కరించాలని సింగరేణి గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం నేతలు కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో చైర్మన్. మేనేజింగ్ డైరెక్టర్ డా. బుద్ధ ప్రకాష్ జ్యోతి, ఐఏఎస్‌ను సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ధరావత్ పంతుల, ప్రధాన కార్యదర్శి భూక్య నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డా. బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని సంస్థ పరిధిలోని 11 ఏరియాల్లో వేడుకల నిర్వహణకు ప్రతి ఏరియాకు రూ.లక్ష చొప్పున నిధులు మంజూరు చేసినందుకు సీఎండీకి సంఘ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన ఉద్యోగులకు న్యాయం చేయాలని పలు డిమాండ్లు ఉంచారు. కొన్ని డిజిగ్నేషన్‌లలో రిజర్వేషన్ అమలు సక్రమంగా లేదని దాంతో గిరిజనులు నష్టపోతున్నారని వివరించారు. సుమారు 300కు పైగా బ్యాక్‌లాగ్ పోస్టులను తాత్కాలికంగా భర్తీ చేసి, అనంతరం శాశ్వత నియామకాలతో ప్రమోషన్లు కల్పించాలని కోరారు. ఆఫీసర్ల ప్రమోషన్లలో క్లస్టర్, ఇంటర్–క్లస్టర్ విధానాల వల్ల ఈ4నుంచి ఈ6 గ్రేడ్లలో ఆర్ఓఆర్ అమలు కావడం లేదని, దాంతో గిరిజన అధికారులకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. ఈ విధానాన్ని నిలిపివేసి, రోస్టర్ రిజిస్టర్ తప్పనిసరిగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన ఉద్యోగుల సమస్యలపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షా సమావేశాలు నిర్వహించాలని కూడా కోరారు. దీనిపై సీఎండీ సానుకూలంగా స్పందించి, సంబంధిత అధికారులతో సమగ్ర సమీక్ష చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్, జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రామచందర్‌ను కలిసి, పెండింగ్‌లో ఉన్న సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘ వర్కింగ్ ప్రెసిడెంట్ గూగులోతు దశరథ్, వైస్ ప్రెసిడెంట్ ఆంగోత్ భాస్కర్ రావు, జాయింట్ ట్రెజరర్ బి. సురేష్, భూక్య కిషన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే సంస్థ అభివృద్ధికి తోడ్పాటు




శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్



**ఘనంగా సింగరేణి వార్షిక క్రీడల బహుమతుల ప్రధానోత్సవం**

**మంచిర్యాల, 3,ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** సింగరేణి సంస్థలో ఉద్యోగులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే తమ విధుల్లో సమర్థవంతంగా పనిచేసి సంస్థ అభివృద్ధికి తోడ్పడగలరని మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ ఏరియా జీఎం మునిగంటి శ్రీనివాస్ అన్నారు. 2025–2026 సంవత్సరానికి సంబంధించిన సింగరేణి ఇంటర్ డిపార్ట్మెంటల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, కళాకారులకు బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమం ఏరియాలోని శ్రీరాంపూర్ ప్రగతి స్టేడియం లోని సీఈఆర్ క్లబ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జీఎం మునిగంటి శ్రీనివాస్ విజేతలకు బహుమతులు అందజేశారు. గత సంవత్సరం సెప్టెంబర్ 25న శ్రీరాంపూర్‌లో 17 విభాగాల్లో ఇండోర్, అవుట్‌డోర్ క్రీడలు నిర్వహించగా, అందులో ప్రతిభ చాటిన క్రీడాకారులు, కళాకారులను ఈ సందర్భంగా సత్కరించారు. ఈ సందర్భంగా జి ఎం మాట్లాడుతూ, క్రీడలు ఉద్యోగుల ఆరోగ్యం, మానసిక స్థైర్యాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియా క్రీడాకారులు సింగరేణి స్థాయితో పాటు కోల్ ఇండియా మరియు జాతీయ స్థాయిల్లోనూ విశేష గుర్తింపు పొందుతున్నారని, తమ ప్రతిభతో ఏరియాకు గర్వకారణంగా నిలుస్తున్నారని కొనియాడారు. ఉద్యోగుల వినోదం, ఆరోగ్యాభివృద్ధి కోసం సింగరేణి సంస్థ క్రీడా మైదానాలు, క్లబ్బులు, స్విమ్మింగ్ పూల్స్, వ్యాయామశాలలు, పార్కులు, వాకింగ్ ట్రాక్స్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేస్తోందని తెలిపారు. ఇటీవల ఆధునిక ఓపెన్ జిమ్‌లను కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ సదుపాయాలను ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం ఎన్. సత్యనారాయణ, గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా, డీజీఎం (పర్సనల్) ఎస్. అనిల్ కుమార్, ఆర్కే ఎన్టికి మేనేజర్ కూరపాటి శ్రీనివాస్, డబ్ల్యుపిఎస్ జీఏ హానరరీ సెక్రటరీ సృజన్ పాల్, స్పోర్ట్స్ సెక్రటరీ చాట్ల అశోక్‌తో పాటు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, కళాకారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లి మున్సిపాలిటీలో సెక్షన్ 163 అమలు



**మంచిర్యాల, 3 ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో రేపు (శనివారం) చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికల నేపథ్యంలో సెక్షన్ 163 బి.ఎన్.ఎస్.ఎస్. యాక్ట్ అమల్లో ఉంటుందని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ నిబంధనలు ఏప్రిల్ 4 ఉదయం 6 గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాలుగు మందికి మించి గుంపులుగా చేరడం పూర్తిగా నిషేధమని ఆయన స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణాన్ని భంగం కలిగించేలా రెచ్చగొట్టే వ్యాఖ్యలు, కవ్వింపు చర్యలు, గొడవలకు దారితీసే ప్రవర్తనపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విధి నిర్వహణలో ఉన్న పోలీసులు, అటవీ సిబ్బంది, కేంద్ర బలగాలు, హోమ్‌గార్డులు, ఎస్పీఓలకు ఈ ఆంక్షలు వర్తించవని తెలిపారు. చట్టపరమైన అనుమతి లేకుండా ధర్నాలు, రాస్తారోకోలు, ర్యాలీలు, ఊరేగింపులు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని చెప్పారు. అదేవిధంగా కర్రలు, కత్తులు, తుపాకులు వంటి మారణాయుధాలతో సంచరించడం పూర్తిగా నిషేధమని పేర్కొన్నారు. మైకులు, లౌడ్‌స్పీకర్ల ద్వారా ప్రసారాలు చేయడం, సభలు నిర్వహించడం, వర్గాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే ప్రసంగాలు చేయడం కూడా నిషేధమని తెలిపారు. సెక్షన్ 163 అమలు సమయంలో చట్టబద్ధ అధికారాన్ని ధిక్కరించే విధంగా ప్రకటనలు, ప్లకార్డులు, గుర్తులు ప్రదర్శించడం కూడా చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు. ఈ ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించిన పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

## సీసీ రోడ్డు నిర్మాణంతో డోడ్డీగూడలో సౌకర్యం



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 03 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలం డోడ్డీగూడ గ్రామంలో రూ.3 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గురునులే నారాయణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమని తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడం అవసరమని పేర్కొన్నారు. ఈ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో రాకపోకలు సులభతరం అవుతాయని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు గుర్నులే నారాయణ్, సీనియర్ నాయకులు జాబోరే గణేష్, ఉప్రే ధర్మ, ఉప సర్పంచ్ భీంరావ్, ఐడీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ బాజీరావు, గ్రామ కార్యదర్శి రమాదేవి, వార్డ్ సభ్యులు వాడై ఉమేష్, సిదాం అయ్యు, ఉప్రే రవి, ముంజం దయానంద్, గ్రామపటేల్ గురనులే డోదజీ, వాడై పోశెట్టి, వాడై సావిత్రబాయ్, సదాశివ్, జంగు, అన్నారావు, రవి, శంకర్ తదితరులు పాల్గొన్నారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రజాప్రతినిధులకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. సీసీ రోడ్డు నిర్మాణంతో గ్రామంలో రాకపోకలు సౌకర్యవంతం కానున్నాయని వారు ఆనందం వ్యక్తం చేశారు.

# పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తి పిప్పిరిలో సీఎం సభకు విస్తృత ఏర్పాట్లు

## ఏప్రిల్ 6న బోథ్ నియోజకవర్గంలో భారీ బహిరంగ సభ

### ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలి ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు

**మంచిర్యాల, 3,ఏప్రిల్ (ప్రజా జ్యోతి):**పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు మూడేళ్లు పూర్తైన సందర్భంగా, 99 రోజుల ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 6న బోథ్ నియోజకవర్గంలోని పిప్పిరి గ్రామంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భారీ బహిరంగ సభ ఏర్పాట్లను రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకట స్వామి, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డిలతో కలిసి మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు లు శుక్రవారం పరిశీలించారు.సభా వేదిక, ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సదుపాయాలు భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలను వారు సమీక్షించారు. అధికారులకు అవసరమైన సూచనలు చేస్తూ, కార్యక్రమం విజయవంతంగా నిర్వహించే లా అన్ని చర్యలు తీసు కోవాలని ఆదేశించారు.అనంతరం ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్‌లో ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు మాట్లాడుతూ, ఏప్రిల్ 6న జరగనున్న ముఖ్యమంత్రి భారీ బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి



విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సభ ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరువ అవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, వివిధ శాఖల అధికారులు, మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## వడూరులో క్రికెట్ సందడి టోర్నమెంట్ ప్రారంభించిన సర్పంచ్



**నేరడిగొండ ఏప్రిల్ 03 (ప్రజాజ్యోతి):** నేరడిగొండ మండలం వడూర్ గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన "వడూర్ ప్రీమియర్ లీగ్" క్రికెట్ టోర్నమెంట్‌ను గ్రామ సర్పంచ్ అడేపు శ్రీకాంత్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. యువతకు క్రీడలు ఎంతో అవసరమని, ఆటల పోటీలు మానసిక ఉల్లాసాన్ని ఇవ్వడమే కాకుండా శారీరక ఆరోగ్యానికి ఎంతో తోడ్పడతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికే ఇలాంటి టోర్నీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. యువత క్రీడా స్ఫూర్తితో మెలిగి, క్రమశిక్షణతో ఆటల్లో రాణించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్రడ్ల మమత చంద్రశేఖర్, నాయకులు అదుముళ్ళ భూషణ్, మాజీ ఉప సర్పంచ్ ఫాయాజ్, అస్మాత్, మాజీ దర్బ తండా సర్పంచ్ సుశీల్, అదుముల్ల రాములు, పాల శంకర్, పండరి, ఉషాన్న, స్వామి, మోహన్, దేవుసింగ్, శంకర్, సతీష్, హరీష్, కిశోర్, ప్రశాంత్, అజీమ్, నర్సయ్య, సుదర్శన్ మరియు పెద్ద సంఖ్యలో యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్యాతనపల్లి ఎన్నికలకు కట్టుదిట్టమైన బందోబస్తు



బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్

**రామకృష్ణాపూర్,ఏప్రిల్ 3 ((ప్రజా జ్యోతి):** క్యాతనపల్లి మున్సిపాలిటీలో రేపు జరగనున్న చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు. మొత్తం 485 మంది పోలీసు సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు.బందోబస్తులో ఏసీపీలు 4 మంది, సీఐలు 23 మంది, ఎస్ఐలు 46 మంది, ఏఎస్ఐలు/హెడ్ కానిస్టేబుల్స్ 98 మంది, కానిస్టేబుల్స్ 167 మంది, మహిళా సిబ్బంది 49 మంది, స్పెషల్ పార్టీ 38 మంది, హోం గార్డ్స్ 60 మంది విధులు నిర్వహించనున్నారు. అదనంగా నాలుగు టీఎస్ఎస్పీ ప్లాటూన్లు కూడా మోహరించారు.ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏసీపీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, ఉన్నతాధికారుల ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. అనవసర వాగ్వా దాలకు దూరంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పోలీసులకు సహకరించాలని కోరారు.

## రక్తదానం చేసిన యువకుడు

**బోథ్, ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)** సోనాల మండల కేంద్రానికి చెందిన ఎరెకర్ కృష్ణవేణి కి ఆదిలాబాద్ రిమ్స్ నందు బి పాజిటివ్ రక్తం అత్యవసరం ఉండడంతో అదే మండల కేంద్రానికి చెందిన ప్రజా శంఖారావం పాత్రికేయుడు పడిగేల నాగరాజు స్పందించి ఆదిలాబాద్ రిమ్స్ కి వెళ్లి రక్తదానంచేసి అందరికి ఆదర్శం గా నిలిచారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ ముందుకు సాగుతున్న నాగరాజు ను పలువురు అభినందించారు.



## జేత్వాన్ బుద్ధ విహార్‌లో శివాజీ మహారాజ్ వర్ధంతి



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 03 ప్రజా జ్యోతి** ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో శుక్రవారం ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహారాజ్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం త్రిశరణ్ పంచశీల, బుద్ధ వందన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా పరిపాలన సాగించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ సేవలను కొనియాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు.ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహుల్కర్, వాంకిడి మండల అధ్యక్షుడు దుర్గం దుర్గాజీ, ప్రధాన కార్యదర్శి విజయ్ ఉప్రే, అంబేద్కర్ సంఘం ఉపాధ్యక్షుడు దుర్గం సునీల్ కుమార్, దుర్గం దొండుజీ శ్యామ్‌రావు, కార్యదర్శి ప్రతాప్ రాంటేంకే, మోట మహార్లు శ్యామ్‌రావు, లహుకె దుర్గే, రాజేశ్వర్ ఉప్రే, బౌద్ధ ఉపాసకులు పాండుజీ, నాయకులు బలవంత్, ప్రకాశ్, సమత సైనిక్ దళ్ యువకులు స్వాగత్, ప్రశాంత్, తిరుపతి, సురేష్, ప్రవీణ్, పల్లక్రావు, ప్రసాద్ వేకటి తదితరులు పాల్గొన్నారు.

## చరిత్రక భావి ఇప్పుడు చెత్తకుప్ప



**నేరడిగొండ, ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి ):**ఒకప్పుడు ఆ గ్రామం దాహార్తిని తీర్చిన జలవనరు అది..ఎంతో మందికి జీవనాధారమైన ఆ చారిత్రక బావి నేడు అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారింది. నేరడిగొండ మండలంలోని గుత్పాల గ్రామ బీసీ కాలనీలో గల పురాతన బావి సరైన నిర్వహణ లేక తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోంది. ప్రస్తుతం ఈ బావి గుర్రపుడెక్క, పిచ్చిమొక్కలు, చెత్తాచెదారంతో నిండిపోయి కంపు కొడుతోంది. అనారోగ్యాలకు నిలయంగా. గతంలో ఈ బావి నీరు ఎంతో స్వచ్ఛంగా ఉండేవని, తాగునీటితో పాటు పశువుల అవసరాలకు కూడా గ్రామస్తులు ఈ నీటినే వాడేవారని స్థానికులు గుర్తు చేసుకుంటున్నారు. అయితే, కాలక్రమేణా బావి చుట్టూ ఉన్న రక్షణ గోడలు శిథిలం కావడం, పర్యవేక్షణ కరువవడంతో అది కాస్త చెత్తను పారబోసే అడ్డాగా మారింది. ప్రస్తుతం బావిలో ప్లాస్టిక్ వ్యర్థాలు, కుళ్ళిన ఆకులు పేరుకుపోయి నీరు కలుషితమైంది. దీంతో తీవ్ర దుర్వాసన వెదజల్లడమే కాకుండా, దోమలు వృద్ధి చెంది అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని కాలనీ ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా, బావి చుట్టూ పెరిగిన పిచ్చిమొక్కల కారణంగా పాములు, విషకీటకాలు చేరుతున్నాయని వాపోతున్నారు. పునరుద్ధరించాలని డిమాండ్ వేసవి కాలం దృష్ట్యా భూగర్భ జలాల సంరక్షణ ఎంతో ముఖ్యం. ఇలాంటి తరుణంలో ఇంతటి చారిత్రక నేపథ్యం ఉన్న బావిని వదిలేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి, తక్షణమే బావిలో పూడికను తొలగించి, రక్షణ గోడలు నిర్మించాలని కోరుతున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టి ఈ చారిత్రక బావిని మళ్లీ ప్రజలకు ఉపయోగపడేలా పునరుద్ధరించాలని బీసీ కాలనీ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# కుటుంబ సభ్యులతో వృద్ధుల మానసిక వేదనలు... పెరుగుతున్న ఒంటరితనం

**మంచిర్యాల, 3,ఏప్రిల్ (ప్రజా జ్యోతి):** నేటి ఆధునిక జీవనశైలిలో కుటుంబ వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు వృద్ధుల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఉద్యోగాలు, విద్య, వ్యాపారాల కోసం యువత నగరాలకు, విదేశాలకు వెళ్లిపోతుండటంతో వృద్ధులు గ్రామాల్లో లేదా పాత ఇళ్లలో ఒంటరిగా మిగిలిపోతున్నారు. కొందరు పిల్లలతో కలిసి ఉన్నా భావోద్వేగ అనుబంధం తగ్గిపోవడం వల్ల ఒంటరితనం వారిని వెంటాడుతోంది. రోజంతా మాట్లాడేందుకు ఎవరూ లేకపోవడం, తమ భావాలను పంచుకునే అవకాశం లేకపోవడం వృద్ధులలో మానసిక ఒత్తిడిని పెంచుతోంది. ఈ ఒంటరితనం క్రమంగా నిరాశ, ఆందోళనలకు దారితీస్తోంది. ఒకప్పుడు కుటుంబంలో పెద్దల మాటకు విలువ ఉండేది. కానీ ఇప్పుడు యువత తమ నిర్ణయాలను స్వయంగా తీసుకుంటూ, పెద్దల అభిప్రాయాలను పట్టించుకోకపోవడం వృద్ధులకు తీవ్ర మనోవేదన కలిగిస్తోంది. తగ్గుతున్న గౌరవం. దెబ్బతింటున్న ఆత్మవిశ్వాసం తమ అనుభవాన్ని ఎవరూ గుర్తించకపోవడం, తమ మాటకు ప్రాధాన్యం లేకపోవడం వలన వృద్ధులు తమ విలువ తగ్గిపోయిందనే భావనకు లోనవుతున్నారు. ఇది వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. ఆర్థిక ఆధారపడటం... అవమాన భావన రిటైర్ అయిన తర్వాత చాలా మంది వృద్ధులు పిల్లలపై ఆర్థికంగా ఆధారపడాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో పిల్లలు సరైన శ్రద్ధ చూపకపోవడం వల్ల తమ అవసరాలను చెప్పుకోవడానికి కూడా సంకోచిస్తున్నారు. "జీవితమంతా కష్టపడి సంపాదించినా, చివరికి ఇలా ఆధారపడాల్సి వస్తుందా?" అనే ఆవేదన వారిని లోలోపల వేధిస్తోంది. ఆరోగ్య సమస్యలు... నిర్లక్ష్యం బాధ వృద్ధాప్యంలో శారీరక, మానసిక సమస్యలు సహజమైనవే అయినా, కుటుంబ సభ్యులు శ్రద్ధ చూపకపోతే అది మరింత బాధను కలిగిస్తోంది. మందులు, వైద్య సేవలతో పాటు ప్రేమ, ఆదరణ కూడా అవసరమని వారు కోరుకుంటున్నారు. "మన ఆరోగ్యం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు" అనే భావన వారిలో తీవ్ర నిరాశను కలిగిస్తోంది. తరం వ్యత్యాసం... పెరుగుతున్న దూరం టెక్నాలజీ, సోషల్ మీడియా, ఆధునిక సంస్కృతి వల్ల యువత ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయింది. ఇది పెద్దలకు అర్థం కావడం కష్టమవుతోంది. ఈ తరం వ్యత్యాసం వల్ల పెద్దలు, పిల్లల మధ్య అపార్థాలు, గొడవలు పెరిగి, మానసిక ప్రశాంతత దెబ్బతింటోంది. వృద్ధాశ్రమాల వైపు మళ్లింపు కొన్ని కుటుంబాల్లో వృద్ధులను భారం అనుకుని వృద్ధాశ్రమాలకు పంపించడం పెరుగుతోంది. తమ పిల్లల చేతుల్లో పెరిగిన వారు చివరికి వారిచేతనే విడిచిపెట్టబడడం వృద్ధులకు తీవ్రమైన మానసిక దెబ్బగా మారుతోంది. పరిష్కార మార్గాలు ఈ సమస్యలను తగ్గించడానికి కుటుంబ సభ్యులు, సమాజం కలిసి కృషి చేయాల్సిన అవసరం ఉంది. వృద్ధులతో ప్రతిరోజూ కొంత సమయం గడపాలి వారి మాటలను ఓర్పుతో వినాలి చిన్న విషయాల్లోనూ వారిని భాగస్వాములుగా చేయాలి వారి అనుభవాలను గౌరవించాలి ప్రేమతో మాట్లాడి ఒంటరితనం తగ్గించాలి



అదేవిధంగా, వృద్ధుల కోసం ప్రత్యేక కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, వినోద కార్యక్రమాలు నిర్వహించాలి. వృద్ధాశ్రమాల సదుపాయాలను అధికారులు పర్యవేక్షించాలి. పెన్షన్, ఆరోగ్య భద్రత వంటి అంశాలను బలోపేతం చేయాలి. వృద్ధుల సంక్షేమ చట్టాలను కట్టుదిట్టంగా అమలు చేయాల్సిన అవసరం ఉంది. వృద్ధులు సమాజానికి మూలస్తంభాలు వృద్ధులు సమాజానికి జ్ఞానం, అనుభవం, విలువలు అందించిన మహత్తర వ్యక్తులు. అలాంటి వారిని నిర్లక్ష్యం చేయడం మన సంస్కృతికి విరుద్ధం. కుటుంబంలో వృద్ధులు సంతోషంగా ఉంటేనే ఆ కుటుంబం నిజమైన ఆనందాన్ని పొందుతుంది. వారి మానసిక వేదనలను అర్థం చేసుకుని ప్రేమ, గౌరవం, ఆదరణ ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డెమొక్రటిక్ సీనియర్ సిటీజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణు మాధవ్ పేర్కొన్నారు. "వృద్ధులను గౌరవించే సమాజమే నిజమైన నాగరిక సమాజం" అని ఆయన పిలుపునిచ్చారు.

---

# ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది

**సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న సుదర్శన్ రెడ్డి**

**ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలి:**

**రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి.**

**బాసర.ఎప్రిల్03(ప్రజా జ్యోతి):**బాసర ఆలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందని ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి అన్నారు. ఈనెల 6వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర పర్యటన సందర్భంగా, ఆయన, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందన్ లతో కలిసి బాసరలో ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా బాసరకు చేరుకున్న ప్రభుత్వ సలహాదారు, తదితరులకు కలెక్టర్ అభిలాష అభినవ్ పూల ముక్కలు అందించి స్వాగతం పలికారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి, ముఖ్యమంత్రి ఆలయంలో పూజలు నిర్వహించే ప్రాంతం, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసే ప్రాంతాలు పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. అనంతరం ఆలయ అతిథిగృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం బాసర ఆలయ అభివృద్ధికి చిత్తశుద్ధితో ఉందని అన్నారు. బాసర తో పాటు, రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆలయాలు అన్ని అభివృద్ధిపరిస్తుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఈ నెల అరవ తేదీన



ముఖ్యమంత్రి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారని చెప్పారు. దేశం నలుమూలల నుంచి బాసరకు ఎంతో మంది భక్తులు వస్తారని, ఆ భక్తులకు ఇబ్బందులు కలుగకుండా, దర్శనాలు సౌకర్యవంతంగా పూర్తయ్యేలా తగిన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి బాసర పర్యటనకు అధికారులంతా సమన్వయంతో పకడ్బందీగా ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆలయ ఈవో విజయరామారావు, తహసిల్దార్ పవన్ చంద్ర, సర్పంచ్ వెంకటేష్ గౌడ్ లక్ష్మణరావు నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## మోసపూరిత మెయిల్స్,సందేశాలను తెరవకూడదు




**జన్నారం,ఏప్రిల్3(ప్రజాజ్యోతి)**ఈ మధ్య కాలంలో సైబర్ నేరాలు రోజు రోజుకు విపరీతంగా పెరిగిపోతున్నాయి. చదువురాని వాళ్ళే కాకుండా చదువుకున్న వారు కూడా సైబర్ నేరగాళ్ల మాయలో పడి లక్షల రూపాయలు పోగొట్టుకుంటున్నారు. అందుకే ప్రజలకు పోలీసు సిబ్బంది వారు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం నాడు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో స్థానిక పోలీసు శాఖ వారు సైబర్ నేరాల పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ అపరిచిత కాల్స్ వచ్చినపుడు కొంచం జాగ్రత్త వహించాలని, మీ వ్యక్తిగత సమాచారాన్ని ఎవరికి ఇవ్వకూడదని, బ్యాంక్ సిబ్బంది ఎప్పుడూ మీ వివరాలను అడగదని అలాంటి ఫోన్ కాల్స్ వస్తె మీ వివరాలు కానీ అలాగే ఓ టి పీ లు చెప్పకూడదని సూచించారు. మీ డబ్బు పోగొట్టుకుంటే వెంటనే 1930 నంబర్ కు ఫోన్ చేసి కంప్లయింట్ ఇవ్వాలని కోరారు. అలాగే ఇంటర్నెట్ ద్వారా చేసే మోసాలు అంటే ఆన్ లైన్ షాపింగ్, పెట్టుబడి మోసాలు కూడా ఎక్కువగా జరుగుతున్నందున జాగ్రత్త వహించాలని అన్నారు.

## ఆసిఫాబాద్ కలెక్టర్ ఆఫీసులోదొడ్డి కొమురయ్య 106వ జయంతి వేడుకలు



**ఆసిఫాబాద్ ఏప్రిల్ 03 ప్రజా జ్యోతి** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరుడు, తొలి అమరుడు దొడ్డి కొమురయ్య జీవిత చరిత్రను భావితరాలకు అందించడం అవసరం అని జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి రమాదేవి తెలిపారు. దొడ్డి కొమురయ్య జయంతిని పురస్కరించుకుని శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవనంలోని సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వేడుకలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ మెంగ్రే ఆకాష్, మాజీ ప్రజా ప్రతినిధులు అరిగెల నాగేశ్వరరావు, మల్లికార్జున్, మట్టూరి జయ రాజ్, ఖమన గ్రామ ఉపసర్పంచ్ లోబడే లాహుకుమార్, మాజీ ఎంపిటిసి గొల్ల వెనుకబడిన తరగతుల సంఘాల ప్రతినిధులు హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వీరు మాట్లాడుతూ, దొడ్డి కొమురయ్య తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో కీలక పాత్ర పోషించారని, భూస్వాముల దుర్వినియోగాన్ని ఎదుర్కొని ప్రజల్లో చైతన్యం సృష్టించారని తెలిపారు. ఆయన సేవలు చిరస్మరణీయమని, మహనీయుల జయంతి, వర్ధంతి వేడుకలను ప్రభుత్వంగా నిర్వహించడం సంతోషంగా ఉందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ సిద్ధిక్, వివిధ బీసీ కుల సంఘాల ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుప్టి ప్రాజెక్టు వద్దు మా ఊరు మా భూములు మాకే ముద్దు

**-కుప్టి ప్రాజెక్ట్ ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించాలి: ముంపు బాధితుల విన్నపం**

**నేరడిగొండ, ఏప్రిల్ 03 (ప్రజాజ్యోతి ):** ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలో ప్రతిపాదిత కుప్టి ప్రాజెక్ట్ నిర్మాణంపై స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 5.6 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో దాదాపు 1800 కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టు వల్ల వేలాది ఎకరాల పంట భూములు, గిరిజన గ్రామాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని వారు ఆవేదన చెందుతున్నారు.

ముంపు ముప్పు – రైతుల ఆందోళన:

**ప్రస్తుత ప్రతిపాదనల ప్రకారం ప్రాజెక్ట్ నిర్మాణం జరిగితే కుమారి, కుప్టి గ్రామాలతో పాటు గాజిలి, గాంధారి వంటి గిరిజన గూడెంలు ముంపుకు గురవుతాయి. దీనివల్ల:**

సుమారు 3000 మంది జనాభా నిరాశ్రయులవుతారు.వెయ్యికి పైగా గృహ సముదాయాలు నీట మునుగుతాయి.రెండు పంటలు పండే అత్యంత సారవంతమైన 2000 ఎకరాల సాగుభూమి కోల్పోవాల్సి వస్తుంది."మా ఊరు – మా భూములు మాకే ముద్దు" అంటూ ఇప్పటికే ఈ ప్రాంత రైతులు పలుమార్లు ప్రాజెక్ట్ నిర్మాణానికి అడ్డుపడ్డారు.

**తక్కువ ఖర్చుతో ప్రత్యామ్నాయ మార్గాలు:**

ప్రభుత్వానికి భూసేకరణ సమస్య లేకుండా, నిర్వాసితుల గోడు లేకుండా అంతే సామర్థ్యంతో ప్రాజెక్టులు నిర్మించడానికి భౌగోళికంగా అనుకూలమైన ప్రత్యామ్నాయాలను గ్రామస్తులు సూచిస్తున్నారు:



బజార్‌హత్నూర్ మండలంలోని మోదే గ్రామానికి దిగువన ఉన్న లోయలో ఎలాంటి ముంపు లేకుండా 3 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్ట్ నిర్మించవచ్చు.

**చీకట్ల లొద్ది ప్రాజెక్ట్:** పొచ్చెర జలపాతానికి రెండు కిలోమీటర్ల దిగువన ఉన్న చీకట్ల లొద్దిలో 2 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్ట్ నిర్మాణానికి అవకాశం ఉంది.

**ప్రభుత్వానికి విన్నపం:**

ప్రస్తుత ఆర్థిక సంక్షోభ సమయంలో కుప్టి ప్రాజెక్టుకు అయ్యే ఖర్చులో సగం వ్యయంతోనే ఈ ప్రత్యామ్నాయ ప్రాజెక్టులను నిర్మించవచ్చని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా నీటిపారుదల శాఖతో ఈ ప్రాంతాల్లో ప్రాథమిక సర్వే చేయించి, నిర్వాసితుల సమస్య లేకుండా నిర్ణయం తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి బాసర పర్యటనకు విస్తృత ఏర్పాట్లు







**కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం**

**జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిజూపల్లి కృష్ణారావువెల్లడి**

**ఖానాపూర్ ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)** రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 6వ తేదీన బాసర పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి శుక్రవారం పరిశీలించారు.ముందుగా బాసర చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలతో పాటు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు మంత్రులకు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఆలయ అభివృద్ధి పనులు చేపట్టబోయే ప్రాంతాల వివరాలను మంత్రులకు వివరించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్న ప్రదేశాల ను మంత్రులు పరిశీలించి, అధికారులకు కీలక సూచనలు చేశారు. సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

**కుంభమేళా తరహాలో పుష్కరాలు –**

అనంతరం రాజన్న అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాసర అభివృద్ధి పనులకు సంబంధించి రూ.300 కోట్లతో దేవాలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరుస్తామని తెలిపారు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అలాగే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ నెల 6న ముఖ్యమంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగనున్నాయని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, వెడ్మా బొజ్జు పటేల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎస్పీలు సాయి కిరణ్, ఉపేంద్ర రెడ్డి, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, ఆలయ ఈవో విజయ రామారావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## హనుమాన్ ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే చేయూత

**-బోరు పనులు ప్రారంభించిన సర్పంచ్- శ్రీకాంత్**



**నేరడిగొండ ఏప్రిల్ 03 (ప్రజాజ్యోతి):** మండలంలోని వడూర్ గ్రామ పంచముఖి హనుమాన్ మందిర ప్రాంగణంలో భక్తుల నీటి అవసరాల కోసం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తన స్వంత నిధులతో బోరు బావిని ఏర్పాటు చేయించారు. ఇచ్చిన మాట ప్రకారం ఆలయానికి బోరు మంజూరు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.శుక్రవారం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన బోరు బండికి వడూర్ సర్పంచ్ శ్రీకాంత్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఎల్లప్పుడూ సహకరిస్తున్నారని, నీటి సౌకర్యం కల్పించడం వల్ల భక్తులకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భూషణ్, ఫయస్, రాములు, శంకర్, నవీన్, భూమన్న, స్వామి, దేవ్ సింగ్, మోహన్, నర్సయ్య, గంగయ్య, అస్మత్, అజీమ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు చంద్రశేఖర్, అనిల్, రమణ, పోశెట్టి సహ పలువురు గ్రామ ప్రముఖులు హాజరయ్యారు. ఆలయానికి నీటి సౌకర్యం కల్పించి భక్తుల ఇబ్బందులను తొలగించినందుకు వడూర్ గ్రామస్తులు మరియు భక్తులు ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

## ఖానాపూర్ లో గాంజా గస్తీ పలు దుకాణాల్లో తనిఖీలు

**మత్తు పదార్థాల నివారణ అందరి బాధ్యత**

**ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ వెల్లడి**






**ఖానాపూర్ ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి )** నిర్మల్ జిల్లాను గంజాయి మత్తు రహిత జిల్లాగా మార్చాలని ఎస్పీ డాక్టర్ జి జానకి షర్మిల ఆదేశాల మేరకు ఖానాపూర్ పట్టణంలో స్థానిక ఎస్సై రాహుల్ గైక్వాడ్ గాంజా గస్తీ శుక్రవారం నిర్వహించారు ఈ సందర్భంగా పలు పాన్ షాపులు కిరాణా జనరల్ స్టోర్ లను తనిఖీ చేసి మత్తు పదార్థాలు గుట్కా గాంజా జార్ద లాంటివి ఏమైనా విక్రయిస్తున్నా రని క్షుణ్ణంగా తన సిబ్బందితో పరిశీలించారు అనంతరం ఓ చోట వ్యాపారస్తులను ప్రయాణికులను ఆటో డ్రైవర్లతో పాటు ఇతరులను సమావేశపరిచి అక్రమంగా గంజాయి గానీ మత్తు పదార్థాలు గానీ విక్రయించినట్లయితే చట్టరిత్యా చర్యలు తీసుకోక తప్పదని ఎస్సై హెచ్చరించారు మత్తు పానీయాలతో పాన్ గుట్కాలతో గుడుంబాలతో యువత పెడదారిన పడుతుందని ఈ యువతలో మన కుటుంబీకులు సైతం ఉన్నారేమో అన్న కోణంలో ప్రతి ఒక్కరు బాధ్యత వహించి ఈ మత్తు నిర్మూలనకు సహకరించి యువత చెడిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రజలపై ఉందని ఎస్సై గైక్వాడ్ వివరించారు

## బ్రిడ్జ్ నిర్మాణానికి భూమి పూజ



ఇచ్చోడ ఏప్రిల్ 3 (ప్రజాజ్యోతి ) దుబార్‌పేట్ గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం పనులు ప్రారంభించిన సర్పంచ్ కత్లె ప్రవీణ విఠల్ దుబార్‌పేట్ గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు వేస్తూ, గ్రామ సర్పంచ్ బ్రిడ్జి నిర్మాణ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజలకు రాకపోకలు సులభం చేయడం తో పాటు అభివృద్ధికి దోహదపడుతుంది. గ్రామ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్ గారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేస్తున్నాం అని గ్రామప్రజలు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సలాం రావు చకటి పవన్ కుమార్ అలాగే గ్రామ పటేల్ సలాం నగోరావు మరియు గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు

## ముఖ్యమంత్రి బాసర పర్యటనకు విస్తృత ఏర్పాట్లు

**కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం**

**జిల్లా ఇన్‌చార్జ్ మంత్రిజూపల్లి కృష్ణారావువెల్లడి**

ఖానాపూర్ ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి) రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఈ నెల 6వ తేదీన బాసర పర్యటనకు సంబంధించి ఏర్పాట్లను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి లు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తో కలిసి శుక్రవారం పరిశీలించారు. ముందుగా బాసర చేరుకున్న మంత్రులకు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిలతో పాటు అధికారులు పూల మొక్కలు అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆలయ ప్రాంగణాన్ని పరిశీలించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. జ్ఞాన సరస్వతి అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వేద పండితులు మంత్రులకు ఆశీర్వచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఆలయ అభివృద్ధి పనులు చేపట్టబోయే ప్రాంతాల వివరాలను మంత్రులకు వివరించారు. ముఖ్యమంత్రి శంకుస్థాపనలు చేయనున్న ప్రదేశాలను మంత్రులు పరిశీలించి, అధికారులకు కీలక సూచనలు చేశారు. సీఎం పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.కుంభమేళా తరహాలో పుష్కరాలు అనంతరం రాజన్న అతిథి గృహంలో నిర్వహించిన సమావేశంలో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా బాసర అభివృద్ధి పనులకు సంబంధించి రూ.300 కోట్లతో దేవాలయాన్ని ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి పరుస్తామని తెలిపారు. దేశ నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు.అలాగే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో ఘనంగా నిర్వహించేలా చర్యలు చేపడతామని వెల్లడించారు. ఈ నెల 6న ముఖ్యమంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగనున్నాయని తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముధోల్, ఖానాపూర్ ఎమ్మెల్యేలు పవార్ రామారావు పటేల్, వెడ్మా బొజ్జు పటేల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, ఏఎస్పీలు సాయి కిరణ్, ఉపేంద్ర రెడ్డి, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, భైంసా మున్సిపల్ చైర్మన్ దత్తాత్రి, ఆలయ ఈవో విజయరామారావు, ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎండలో రేషన్ కోసం నిలబడుతున్న గ్రామస్తులకు సౌకర్యం

**స్వాంగి సర్పంచ్ విమలబాయి**



కెరమేరి ఏప్రిల్ 03 ప్రజా జ్యోతి కెరమెరి మండలం స్వాంగి గ్రామంలో రేషన్ షాపులో ప్రజలు ఎండలో నిలబడి రేషన్ తీసుకోవడం చూసి గ్రామ సర్పంచ్ కార్వెత విమల బాయి తక్షణమే సౌకర్యాత్మక చర్యలు చేపట్టారు. ప్రజలకు వాతావరణం మంచిగా ఉండేలా టెంట్ ఏర్పాటు చేయించారు, తద్వారా వారు ఎండలో నష్టపోకుండా రేషన్ తీసుకోవడం సాధ్యమైంది. సర్పంచ్ విమల బాయి మాట్లాడుతూ, “గ్రామస్తులు ఎండలో నిలబడటం అనేది అనారోగ్యానికి కారణం అవుతుంది. అందువల్ల తక్షణమే టెంట్ ఏర్పాట్లు చేసి, వర్షం లేదా గాలి వంటి పరిస్థితుల నుండి రక్షణ కల్పించడం అత్యవసరం” అని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు కూడా పాల్గొన్నారు. వారి సహకారంతో, రేషన్ పంపిణీ సక్రమంగా మరియు వేగవంతంగా జరిగింది. సర్పంచ్ పైగ్రామస్తులు మంచి అభినందనలు తెలిపారు.గ్రామంలో ఇలాంటి చిన్న సౌకర్యాలు కూడా ప్రజల జీవితాన్ని సౌకర్యవంతంగా మార్చగలవని, ప్రభుత్వం మరియు స్థానిక పాలకుల తక్షణ స్పందన అత్యంత అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## బాసర ఐఐటీ విద్యార్థులతో కలిసి మంత్రి జూపల్లి భోజనం



బాసర ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి) నిర్మల్ జిల్లాలోని ప్రతిష్ఠాత్మక బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి మెస్‌లో రాత్రి భోజనం చేశారు. విద్యార్థుల మధ్య కూర్చున్న మంత్రి, వారికి వడ్డిస్తున్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు.భోజనం నాణ్యతపై ఆరా భోజనం చేస్తున్న సమయంలో విద్యార్థులతో మంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. రోజువారీ మెనూ ప్రకారం భోజనం అందుతోందా? అని ఆరా తీశారు. కూరగాయలు, భోజనం నాణ్యత ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. దీనిపై విద్యార్థులు స్పందిస్తూ.. ప్రతిరోజు తమకు అందుతున్న భోజన వివరాలను, క్యాంపస్‌లో కల్పిస్తున్న ఇతర సదుపాయాలను మంత్రికి వివరించారు. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు కలగకుండా చూడాలని అధికారులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు.అధికారుల బృందం పర్యవేక్షణ మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఐఐటీ వైస్ ఛాన్సలర్ గోవర్ధన్ తదితర ఉన్నతాధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, వారికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

## కుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాలు నిర్వహిస్తాం

**బాసర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం**



బాసర ఏప్రిల్ 3 ( ప్రజా జ్యోతి) బాసర జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు కుంభమేళ తరహాలో గోదావరి పుష్కరాల ను నిర్వహిస్తామని ఇప్పటినుండే పనులు ప్రారంభించడం జరుగుతుందని జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఈనెల 6న బాసరకు ముఖ్యమంత్రి రానుండడంతో ఏర్పాట్ల విషయమై చర్చించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే పవార్ రామారావ్ పటేల్ తో కలిసి ఆయన ప్రెస్ మీట్ లో మాట్లాడారు. బి ఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో బాసర అమ్మవారి ఆలయం ఎలాంటి అభివృద్ధికి నోచుకోలేదన్నారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాసర ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం జరిగిందన్నారు. అందులో భాగంగానే బాసర మాస్టర్ ప్లాన్ కు 180 కోట్ల రూపాయల నిధులు, ముధోల్ లో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటుకు 200 కోట్ల రూపాయల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. పుష్కరాల వరకు పనులు పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. వెనుకబడిన ఉమ్మడి అదిలాబాద్ జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తమ ధ్యేయమన్నారు. అదేవిధంగా కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సైతం బాసరలో పర్యటించారు.

## బాసర ఐఐటీ విద్యార్థులతో కలిసి మంత్రి జూపల్లి భోజనం



నిర్మల్ జిల్లా ప్రతినిధి ,ఏప్రిల్ 3 ,( ప్రజాజ్యోతి ).జిల్లాలోని ప్రతిష్ఠాత్మక బాసర రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం రాత్రి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో కలిసి మెస్‌లో రాత్రి భోజనం చేశారు. విద్యార్థుల మధ్య కూర్చున్న మంత్రి, వారికి వడ్డిస్తున్న ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించారు. భోజనం నాణ్యతపై ఆరా భోజనం చేస్తున్న సమయంలో విద్యార్థులతో మంత్రి ఆప్యాయంగా మాట్లాడారు. రోజువారీ మెనూ ప్రకారం భోజనం అందుతోందా? అని ఆరా తీశారు. కూరగాయలు, భోజనం నాణ్యత ఎలా ఉంటుందని అడిగి తెలుసుకున్నారు. దీనిపై విద్యార్థులు స్పందిస్తూ.. ప్రతిరోజు తమకు అందుతున్న భోజన వివరాలను, క్యాంపస్‌లో కల్పిస్తున్న ఇతర సదుపాయాలను మంత్రికి వివరించారు. విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు కలగకుండా చూడాలని అధికారులకు ఈ సందర్భంగా ఆయన సూచించారు. అధికారుల బృందం పర్యవేక్షణ మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, ఐఐటీ వైస్ ఛాన్సలర్ గోవర్ధన్ తదితర ఉన్నతాధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, వారికి నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు.

# ఆసిఫాబాద్: కాంగ్రెస్ జిల్లా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం







**మహేష్ కుమార్ గౌడ్ కీలక సూచనలు, పార్టీ బలోపేతంపై దృష్టి**

**ఆసిఫాబాద్ ఏప్రిల్ 03 (ప్రజా జ్యోతి)** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నూతన జిల్లా కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన నూతన సభ్యులకు ప్రమాణ స్వీకారం చేయించి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. జిల్లాలో కాంగ్రెస్ కార్యకలాపాలను మరింత విస్తరించే దిశగా నాయకులు పని చేయాలని స్పష్టం చేశారు.సమావేశం ఆసిఫాబాద్ పట్టణంలోని రోస్ గార్డెన్‌లో నిర్వహించబడింది. సమావేశానికి మహేష్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క సమావేశానికి అధ్యక్షత వహించారు. సమావేశానికి ముందు, మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ సెక్రటరీ సచిన్ సావంత్లతో కలిసి సుగుణక్కను శాలువాలతో సన్మానించారు. అనంతరం నూతన జిల్లా కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలను ఆయన చేతుల మీదుగా అందజేశారు.మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, ఆసిఫాబాద్ చిన్న జిల్లా అయినా ప్రాముఖ్యత కలిగినదని, గతంలో కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉన్న ఈ జిల్లా మళ్లీ అభివృద్ధి మార్గంలో ఉందని పేర్కొన్నారు. రాహుల్ గాంధీ పాదయాత్ర ప్రజల సమస్యలను తెలుసుకోవడం, వారికి న్యాయం చేయడం లక్ష్యంతో జరిగిందని చెప్పారు. అట్టడుగు వర్గాలకు న్యాయం చేసే పార్టీ కేవలం కాంగ్రెస్ మాత్రమేనని, నాయకత్వంలో 70 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు దక్కిందని తెలిపారు. గ్రామీణాభివృద్ధి దేశాభివృద్ధికి మూలమని గుర్తుచేసి, కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు. దేశంలో దళితులు, గిరిజనులు, వెనుకబడిన వర్గాలకు ఉన్నత పదవులు కల్పించిన పార్టీ కేవలం కాంగ్రెస్ అని హైలైట్ చేశారు.రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మాట్లాడుతూ, గత ప్రభుత్వ పాలనలో భారీ అప్పులు పెరిగాయని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని సమర్థవంతంగా నిర్వహిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగిస్తున్నదని చెప్పారు. రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాల ద్వారా ప్రజలకు ప్రయోజనం కలిగినట్లు, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు కూడా అంగీకరిస్తున్నారని గౌడ్ వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 100కి పైగా సీట్లు సాధించి తిరిగి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో అన్ని స్థానాల్లో గెలుపు సాధిస్తామని, ప్రజలు అభివృద్ధి వైపు కాంగ్రెస్ వైపు చూస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి జిల్లాపై ప్రత్యేక దృష్టి పెట్టారని, భవిష్యత్తులో విమాన సదుపాయం కూడా అందుబాటులోకి రానుందని హామీ ఇచ్చారు.కుమ్రంభీం జిల్లాలో పరిశ్రమలు స్థాపించి, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు బలంగా ఉందని, రాబోయే 20 ఏళ్ల పాటు అధికారంలో ఉంటుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

# కలెక్టరేట్ లో ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలు





**ఆదిలాబాద్ బ్యూరో, ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)** తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, అమరవీరుడు దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవాలను శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల శంక ర్ ముఖ్య అతిథులుగా హాజ రై, దొడ్డి కొమురయ్య చిత్ర ప టానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మా ట్లాడుతూ, భూమి కోసం, భు క్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం పోరాడిన గొప్ప వీరుడు దొడ్డి కొమురయ్య అని కొనియాడారు. ఆయన త్యాగం నేటి తరానికి స్ఫూర్తి దాయకమని, బహుజన ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం వెనుకబడిన తరగతుల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని, వాటిని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. స్థానిక ఎ మ్మెల్యే మాట్లాడుతూ, మహ నీయుల జీవిత చరిత్రలను జయంతి, వర్ధంతి కార్యక్రమాల ద్వారా స్మరించుకోవడంతో పాటు నేటి తరానికి తెలియ జేసే అవకాశం లభిస్తుందన్నారు. బిసి సంక్షేమం, అభివృద్ధి పనులకు ప్రభుత్వం అనేక నిధులు కేటాయించడం జరుగు తుందన్నారు. దొడ్డి కొమరయ్య విగ్రహ ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తా మ నిహమీ ఇచ్చారు. అనంతరం బీసీ సంఘాల నాయకులు దొడ్డి కొమురయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్, ఎమ్మెల్యేలు వినతి పత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా బిసి అభివృద్ధి అధికారి సోనియా, పట్టణ తహసిల్దార్ సంపత్ శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీనివాస్, వివిధ బిసి సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కలకలం రేపిన మాసాయిపేట్ సర్పంచ్ ఆత్మహత్య



**కడెం,ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి):** నిర్మల్ జిల్లా కడెం మండలం మాసాయిపేట్ గ్రామ సర్పంచ్ దుర్గం లహరిక ఆత్మహత్య కలకలం రేపింది. గుర్తు తెలియని పురుగుల మందు సే వించి సర్పంచ్ లహరిక ఆ త్మహత్యకు పాల్పడింది. పు రుగుల మందు సేవించినట్లు గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన సర్పంచు ల హరిక ను కార్ లో ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలి స్తుండగ మార్గ మధ్యలోని న చ్చన్ ఎల్లాపూర్ వద్ద కారు అ దుపుతప్పి నిలిపివున్న ట్రాక్టర్ నాగళ్లను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరికి ఏమి కాక పోవడంతో వేరే వాహనంలో ఖానాపూర్ ఆసుపత్రికి తర లించినా సర్పంచ్ లహరిక కు చికిత్స అందిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుర్గం లహరిక కొద్ది రోజులుగా తన భర్త రాజేష్ తో గొడవలు జరుగుతున్నా యని, భర్త వేధింపులు తట్టు కోలేక జీవితం పై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందని, దుర్గం లహరిక తల్లి తెలిపిన వి వరాల ప్రకారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు కడెం ఎస్సై సాయికిరణ్ తెలి పారు. దుర్గం లహరిక కు కూ తురు, కుమారుడు ఉన్నారు. చిన్న వయసులోనే తల్లిని పో గొట్టుకోవడంతో గ్రామస్తులు కన్నీరుగా విలపించారు. సర్పంచ్ ఆత్మహత్యతో గ్రామంలో విషాదఛ్చాయలు అలు ముకున్నాయి.

## మన ఇసుక వాహనం' పోర్టల్ ద్వారానే ఇసుక విక్రయాలు

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఆదిలాబాద్ బ్యూరో, ఏప్రిల్ 3, (ప్రజా జ్యోతి)** మన ఇసుక – వాహనం (ఎం ఐ వి) పోర్టల్ ద్వారానే ఇసుక విక్రయాలు జరుగుతాయని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో ఇసుక పంపిణీ వ్యవస్థను మరింత పారద ర్శకం చేసేందుకు జిల్లా యం త్రాంగం కీలక నిర్ణయం తీసు కోవడం జరిగిందన్నారు. గ తంలో అమలులో ఉన్న మా న్యువల్ కూపన్ల విధానాన్ని పూర్తిగా రద్దు చేస్తూ, ఇకపై 'మన ఇసుక వాహనం' పోర్ట ల్ ద్వారానే ఆన్‌లైన్ పద్ధతిలో ఇసుక విక్రయాలు జరపాలని కమిటీ నిర్ణయించడం జరిగిందని తెలిపారు. సాధారణ ప్రభుత్వ, ప్రైవేట్ నిర్మాణ పనుల కోసం ప్రతి ట్రాక్టర్ ఇసుక ధరను రూ.400 గా కమిటీ నిర్ణ యించడం జరిగిందని, ము ఖ్యంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం అండగా నిలవాలనే ఉద్దేశంతో, వారికి అవసరమైన ఇసుకను రూ. 15/- (నామమాత్రపుధర) రాయితీ ధరకే అందించడం జరుగుతుంద న్నారు. జిల్లాలోని నిర్దేశిత క్వారీలు, చెరువుల నుండి ఇసుకను పొందేందుకు ఏప్రిల్ 1, 2026 నుండే ఈ ధరలను అమలు పరచడం జరిగిందని తెలిపారు. వినియోగ దారులు తమకు కావలసిన ఇసుకను వెబ్‌సైట్ ద్వారా లేదా ప్లేస్టోర్ లో అందుబాటులో ఉన్న ఎం ఐ వి మొబైల్ యాప్ ద్వారా సులభంగా బుక్ చేసుకోవచ్చని తెలిపారు. మాన్యువల్ కూ పన్లు చెల్లవని, కేవలం ఆన్‌లైన్ రశీదులు ఉన్న వాహనాలనే ఇసుక తరలింపు నకు అను మతిస్తామని ఆయన స్పష్టం చేశారు. హెల్ప్ డెస్క్ నెంబర్ 7569538588 సంప్రదించాలని, ఈ పారదర్శక విధానా న్ని ప్రజలు సద్వినియోగంచే సుకోవాలని కలెక్టర్ ప్రకటన లో కోరారు.

# గ్రామ సభకు వివిధ శాఖల అధికారుల గైర్హాజరుపై తీవ్ర స్థాయిలో నిలదీసిన ప్రజలు

**ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్ మద్దతుగా వార్డు సభ్యుల వాకౌట్ :**
**2 నెలల నుండి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని:**
**ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని:**
**ఆగ్రహంతో గ్రామ సభలో నిలదీసిన జై భీమ్ నగర్ ప్రజలు:**
**కోరం లేక సిర్పూర్(టి) గ్రామసభ అర్ధాంతరంగా ముగింపు:**





**ఏప్రిల్ 3, సిర్పూర్ (టి) నియోజకవర్గ ప్రతినిధి ప్రజా జ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)మండల కేంద్రంలోని 16 గ్రామ పంచాయతీలలో గురు వారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా మేజర్ గ్రామ పంచాయతీ సిర్పూర్(టి)సర్పంచ్ ఓడ్డెట్టి నాగమణి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ప్రత్యేక అధికారి ఏవి రామ్మోహన్ ముఖ్యఅతిథిగా పాల్గొని మండలపంచాయతీ అధికారి వినోద్, సెక్రెటరీ తిరుపతి, ఐసిడిఎస్ సిడిపిఓ విజయలక్ష్మి సూపర్వైజర్ హసీనా వివిధ శాఖల అధికారుల తో కలిసి పలు అభివృద్ధి అంశాలపై విస్తృతంగా చర్చించి తెలంగాణ రాష్ట్ర గీతాన్ని అని పించారు. అనంతరం రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సందేశాన్ని వినిపించారు. గ్రామ సభకు వివిధ శాఖల అధికారులు హాజరు కాక పోవడంతో ప్రజలు, ప్రజా ప్రతినిధులు తీవ్రస్థాయిలో నిడదీశారు. ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్ వార్డ్ సభ్యులు గ్రామ సభను వాకౌట్ చేశారు. సంబం ధిత శాఖల అధికారులు రాకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్య శాఖల అధికారులు లేనిది గ్రామసభ ఏలా నిర్వహిస్తా రని నిలదీశారు. గ్రామసభ గ్రామ సభకు హాజరైన మండల కేంద్రం లోని జై భీమ్ నగర్ కు చెందిన మహిళలతో పాటు మండల కేంద్రానికి చెందిన తులసిరాం, దామర పెల్లి వెంకటేష్, ప్రజా సమస్య లపై అధికారులను నిలదీశారు.

అనంతరం తులసి రామ్ మాట్లాడుతూ.. మండల కేంద్రంలోని జై భీమ్ నగర్ లో గత రెండు నెలల నుండి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదని మహిళలతో కలిసి అధికారులు నిలదీశారు. గత రెండు నెలల నుండి పంచాయతీ సెక్రెటరీ తిరు పతి ని ఇట్టి విషయం పై పలుమార్లు విన్నవించిన గ్రామ సభలో కాలనీ మహి ళలతో కలిసి సంబంధిత శాఖ అధికారులపై ఆగ్ర హం వ్యక్తం చేసి మిషన్ భగీరథ అధికారులు గ్రామ సభకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. గ్రామ సభలో ఉన్న అధికారుల పై మండి పడ్డారు. జై భీమ్ నగర్ లో మిషన్ భగీరథ నీళ్లు ఎప్పుడు సప్లై చేస్తారని సభలో నిలదీశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, మండల అధికారులు సంబంధిత శాఖ అధికారులు స్పందించి వెంటనే మిషన్ భగీరథ వాటర్ సప్లై చేయాలని కోరారు. లేని యెడల ఆందోళన కార్య క్రమాలను ముమ్మరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ప్రజా ప్రతి నిధులు మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు గైహాజరు కావడంపై అట్టి శాఖ ప్రజా సమస్యలను ఎవరు పట్టించు కుంటారని, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉప సర్పంచ్ దుర్గం ప్రశాంత్ తోపాటు వార్డు సభ్యులు అధికారులపై మండిపడ్డారు. సమస్యలు పరిష్కరించాల్సిన అధికారులు లేకుండా గ్రామసభ నిర్వహించడాన్ని తీవ్రంగా తప్పు బట్టారు. సిర్పూర్ (టి) ఉపసర్పంచ్ దుర్గం ప్రశాంత్ సభను అడ్డు కున్నారు. అధికారుల తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేయడంతో గురు వారం స్థానిక గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామ సభ రసాభాసగా మారింది. ఏ ఒక్క అధికారి సభకు రాకుం డానే గ్రామ సభ ఎలా నిర్వహిస్తారని పంచా యతీ సెక్రెటరీ తిరుపతిని ఉపసర్పంచ్ ప్రశాంత్ ప్రశ్నించారు. సభ నిర్వహించడానికి అడ్డు కున్నారు. అర్హులకు పింఛన్లు అందడం లేదు, చిన్న పనుల కోసం వికలాంగులను ఆఫీసుల చుట్టూ తిప్పు కుంటున్నా రని అన్నారు. ఇన్ని సమస్యలు పెట్టుకుని.. సంబంధిత అధికారులే లేకుండా సభ పెడితే మా గోడుఎవరికి చెప్పుకోవాలి" అంటూ తీవ్రస్థాయిలో అధికారులను నిలదీశారు. అన్ని శాఖల అధికారులు వస్తేనే సభ నిర్వహించాలని ఉపసర్పంచ్ నిల దీయడంతో సభలో ఉన్న ప్రజలు కూడా ఆయనకు వంతపాడారు. సుమారు గంట తర్వాత ఎంపీఓ వినోద్ కుమార్,విద్యుత్ శాఖ అధికారులు అక్కడికి చేరుకున్నారు. అయినప్పటికీ ప్రశాంత్ వెనక్కి తగ్గలేదు. అన్ని శాఖల అధికారులు సభకు వస్తేనే సమస్యల కు తగిన పరిష్కారం దొరుకు తుందని, అప్పటి వరకు సమావేశం నిర్వహించే ప్రసక్తే లేదని ప్రశాంత్ పట్టుబట్టారు. ఉపసర్పంచ్ వాదనకు మద్దతుగా వార్డు సభ్యులు సైతం సభను బహిష్కరించి వాకౌట్ చేసి బయటకు వెళ్లిపోయారు. వారితో పాటే ప్రజలు కూడా వెళ్లి పోయారు. ఉప సర్పంచ్ ప్రశాంత్ మాత్రం చివరి వరకు సభలోనే ఉండి సమస్యలపై అధికారుల ను నిలదీస్తూనే ఉన్నారు. ఎంపీఓ నచ్చజెప్పే ప్రయ త్నం చేసినా ప్రయోజనం లేకపోవడంతో.. సభకు కోరం లేక సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించారు.

# మాధక ధ్రవ్యాల అమ్మకాన్ని నిషేదించిన మునిపెల్లి గ్రామం

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)** మండలంలోని మునిపెల్లి గ్రామంలో 23 సంవత్సరాల వయస్సులోపు వ్యక్తులకు మాదక ద్రవ్యాలు పాన్,గుట్కా,అమ్మకాన్ని నిషేదించింది. అలాగే ప్లాస్టిక్ అమ్మకం,కొనుగోలును,టోసుల అమ్మకాన్ని నిషేదించారు. ఇందుకు సంబందించిన తీర్మానాన్ని గ్రామస్తులంతా ఆమోదించినట్లు స్తానిక సర్పంచ్ మేడిపెల్లి సునీత,ఉప సర్పంచ్ ఎన్ రంజిత్ రెడ్డి తెలిపారు. అందుకు సంబందించిన డిజిటల్ బ్యానర్ ను అందరూ తమ వాట్సాప్ గ్రూపులలో పెట్టుకోవటంతో సోషల్ మీడియాలో ఈ విషయం వైరల్ అయ్యింది.




## గంజాయి నిర్మూలన అందరి బాధ్యత ఎస్పై శ్రీకాంత్



**సారంగాపూర్,ఏప్రిల్ 03,ప్రజా జ్యోతి** గంజాయి వ్యాప్తిని పూర్తిగా అరికట్టేందుకు గంజా గస్తీ కార్యక్రమం నిర్మల్ జిల్లా ఎస్పీ డా,జానకీ షర్మిల ఆదేశాల మేరకు మండల కేంద్రంలో కిరాణా దుకాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించబడినవి. ఈ తనిఖీలలో అనుమానాస్పద కార్యకలాపాలు, నిషేధిత పదార్థాల విక్రయం జరగకుండా కట్టుదిట్టమైన పరిశీలనలు చేపట్టడం జరిగింది. అనంతరం స్థానిక ప్రజలు, వ్యాపారులతో కలిసి గంజాయి వినియోగం వల్ల కలిగే అనర్థాలపై ఎస్సై శ్రీకాంత్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. యువత భవిష్యత్తును దెబ్బతీసే గంజాయి వంటి మత్తు పదార్థాలను పూర్తిగా నిరోధించేందుకు ప్రజల సహకారం అత్యంత అవసరమని తెలిపారు. గంజాయి విక్రయం, వినియోగం గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది ప్రేమ్ సింగ్, మాధవ్, వినిల్ రెడ్డి, లింగరం, శ్రీలత పాల్గొన్నారు.

## సిరికొండలో పశువుల సంత

**ప్రారంభించిన సర్పంచ్ బొడ్డు దత్తాత్రి**



**సిరికొండ, ఎప్రిల్ 3, (ప్రజా జ్యోతి)**సిరి కొండ మండల కేంద్రంలో పశువుల సంత ఏర్పాటు చేశారు. ప్రతీ శుక్రవారం నిర్వహించే ఈ పశువుల సంత ను సిరికొండ గ్రామ సర్పంచ్ బొడ్డు దత్తాత్రి, గ్రామపంచాయతీ పాలకవర్గ నిర్ణయం మేరకు పశువుల సంత ప్రారంభించినట్లు గ్రామ పంచాయతీ పాలకవ ర్గం సభ్యులు తెలిపారు. ఈ సంత ను సర్పంచ్ బొడ్డు దత్తాత్రి శుక్రవారం ప్రారంభించారు. ఈ పశువుల సంత ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజక వర్గ ఇంచార్జ్ ఆడే గజేందర్ పాల్గొని మాట్లాడుతూ సిరి కొండ మండలం చుట్టూ పక్క ల 53 గ్రామాలకు, ఇచ్చోడ ఇంద్రవెల్లి, జైనూరు, ఉట్నూర్ ఎక్స్ రోడ్, నార్నూర్, ము త్నూర్ మండలాల ప్రజలకు కూడా అందుబాటులో ఉన్న సిరికొండ మండల కేంద్రంలో శుక్రవారం రోజు పశువుల సంత ప్రారంభించడం చాలా సంతోషకరమైన విషయమని, ఈ పశువుల సంత సిరికొండ మం డల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, క్రయ విక్రయ దారులు వచ్చికొనుగోలు, అమ్మకాలు చేసుకోవాల్సిందిగా కోరారు. ప్రజల సౌకర్యార్థం పశువుల సంత సిరికొండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టువంటి సిరికొండ గ్రామ సర్పంచ్ దత్తాత్రేయతో పాటు వారి పాలకవర్గానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మాధవ పటేల్, సెక్రెటరీ ఇమామ్,మండల అధ్యక్షుడు షేక్ ఇమామ్, జిల్లా సార్ మేడి అమృత్ రావ్, మై నార్టీ చైర్మన్ రంజాన్, రషీద్, సిరిసంపద చైర్మన్ గోర్బండ్ ప్రకాష్, వివిధ గ్రామాల సర్పంచులు, కొండాపూర్ సర్పంచ్ గంగాధర్, సోంపల్లి సర్పంచ్ లక్ష్మీకాంత్, సుంకిడి సర్పంచ్ గణపతి, ధర్మసాగర్ సర్పంచ్ దినేష్, రిమ్మ సర్పంచ్ బందు పటేల్, వార్డ్ మెంబర్లు కస్బే రామారావు, సందీప్, కుమ్ర భీమ్ రావు, తోకల చిన్న రాజన్న, గ్రామ పెద్దలు బాలాజీ పటేల్, సాయిని నరసయ్య, అజీజ్ అస్గర్, అదం, వివిధ గ్రామస్తులు వ్యాపారులు పాల్గొ న్నారు.

# సిఎం రేవంత్ రెడ్డి సభకు పక డ్బందీ ఏర్పాట్లు



ఉమ్మడి జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు



**ఆదిలాబాద్ బ్యూరో, ఏప్రిల్ 3 (ప్రజా జ్యోతి)** ఆదిలాబాద్ జిల్లా బజార్‌హ త్నూర్ మండలం పిప్రి గ్రామం లో ఈనెల 6న రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు పక ద్బందీ ఏర్పాట్లు చేయాలని జి ల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. శు క్రవారం మంత్రి వివేక్ వెంకటస్వామి, ప్రభు త్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి, స్థానిక శాసనసభ్యుడు అనిల్ జాదవ్, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు, జిల్లా కలెక్టర్ రాజర్షి షా తదిత రులతో కలిసి సభా ప్రాంగణా న్ని పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్ర మంలో భాగంగా ముఖ్య మంత్రి ఈనెల 6న ఆదిలా బాద్ జిల్లాలో పర్యటించను న్నారని తెలిపారు. బోథ్‌ని యోజకవర్గంలో సుమారు రూ.1200 కోట్ల వ్యయంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల కోసం ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు శంకుస్థాపన చేయ నున్నారని పేర్కొన్నారు. ఈ విద్యాసంస్థలను కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చి ది ద్దనున్నట్లు తెలిపారు. అలాగే బాసర సరస్వతి దేవాలయ అ భివృద్ధికి రూ.300 కోట్లు, 20 27 గోదావరి పుష్కరాల కోసం రూ.500 కోట్లతో కుంభమేళా తరహాలో ఏర్పాట్లు చేయను న్నట్లు మంత్రి వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా రూ.600 కోట్ల విలువైన అభివృద్ధి పను లకు శంకుస్థాపనలు జరగ నున్నాయని తెలిపారు. సభ కు ప్రజలు భారీ సంఖ్యలో హా జరై విజయవంతం చేయాలని కోరారు.

**పిప్రి సిఎం సభను విజ యవంతం చేయాలి**

**మంత్రి వివేక్ వెంకటస్వామి**

ముఖ్యమంత్రి పర్యటన దృష్ట్యా ఎక్కడా లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు, పార్టీ శ్రేణులకు సూచించా రు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధికి ఈ సభ మైలురాయిగా నిలుస్తుందని తెలిపారు. ట్రాఫిక్ నియంత్రణ, బందోబస్తు, తాగునీరు వంటి సౌకర్యాలను సమకూ ర్చాలని ఆదేశించారు.

**ఉమ్మడి ఆదిలాబాద్ అభి వృద్ధిపై సీఎం దృష్టి**

**ప్రభుత్వ సలహాదారు సుద ర్శన్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అ భివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారని ప్రభుత్వ సలహా దారు సుదర్శన్ రెడ్డి తెలిపారు. సాగునీటి, విద్యా రంగాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తూను మారు రూ.600 కోట్ల పనులకు శ్రీకారం చుట్ట నున్నట్లు వె ల్లడించారు. పిప్రి సభలో కీలక ప్రకటనలు వెలువడే అవకాశం ఉందని పేర్కొన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మా ట్లాడుతూ, ముఖ్యమంత్రి ప ర్యటన రైతులకు ఎంతో మేలు చేస్తుందని అన్నారు. పిప్పిరి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మంజూరు అయితే ప్రాంతం సస్యశ్యా మలం అవుతుందని తెలిపారు. అభివృద్ధి విషయం లో రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని కోరారు.





**ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు**

**జిల్లా కలెక్టర్ రాజర్షి షా**

ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశిం చారు. ఈనెల 6న మధ్యా హ్నం 2:00 గంటలకు హెలి ప్యాడ్ వద్ద ముఖ్యమంత్రి చేరుకుని, అనంతరం సభా ప్రాం గణంలో అభివృద్ధి పనుల శిలాఫలకాలను ఆవిష్కరి స్తారని తెలిపారు. సభలో ప్ర సంగంతో పాటు లబ్ధిదారులకు ఆస్తుల పంపిణీ జరుగు తుందని పేర్కొన్నారు. మహి ళా సంఘాలకు బ్యాంక్ లింకే జీ చెక్కులు, సీఎం కప్ అవా ర్డుల ప్రదానం, గ్రామ పంచాయతీలకు ఐఎస్ఓ సర్టిఫికే షన్లు అందజేయనున్నట్లు వివరించారు. ఎండ తీవ్రత దృష్ట్యా తాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశు ధ్య ఏర్పాట్లు చేయాలని సూచిం చారు. పార్కింగ్, ట్రాఫిక్‌ని యంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. సభలో ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అ ఖిల్ మహాజన్, ఐటిడిఏ పీవో యువరాజ్ మర్మాట్, అధి కారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఆదిలాబాద్ కు టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కు మార్ గౌడ్



**ఆదిలాబాద్ బ్యూరో, ఏప్రిల్ 3, (ప్రజా జ్యోతి)** నేడు శనివారం టీపీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కు మార్ గౌడ్ ఆదిలాబాద్ ప ట్టణానికి రానున్నట్లు ఆది లాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. శు క్రవారం ఆయన తన క్యాంపు కార్యాల యంలో మీడియాతో మాట్లాడారు. జిల్లా నూతన కార్యవ ర్గం పొలిటికల్ యాక్షన్ కమిటీ ప్రతినిధులతో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్లో సమావేశం కానున్నట్లు తెలిపారు. మహేష్ కుమార్ గౌడ్ సమావేశాన్ని కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ఈ నెల 6న సీయం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్, ఆత్మ చైర్మన్ గిమ్మ సంతోష్ రావు, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, షకీల్, శ్రీలేఖ, ప్రశాంత్, ఖయ్యూం తదితరులు పాల్గొ న్నారు.

## ఇటుకల వ్యాపారి అప్సర్ అహ్మద్ ఖాన్ ఇంట్లో పట్టపగలే చోరీ

**1,50,000 వేలనగదు తోపాటు 5 తులాల వెండి దొంగలించ బడింది**

**బాధితుడు అప్సర్ అహ్మద్ ఖాన్**

**ఘటనా స్థలాన్ని పరి శీలిస్తున్న పోలీసులు**

**ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తాం**

**కౌటాల సీఐ సంతోష్ కుమార్, సిర్పూర్ (టి) ఎస్సై సాగర్**

**ఏప్రిల్ 3, సిర్పూర్(టి) నియోజకవర్గ ప్రతినిధి: ప్రజా జ్యోతి:** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్(టి)మండల లోని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న ఇటుకల వ్యాపారి అప్సర్ అహ్మద్ ఖాన్ ఇంట్లో పట్ట పగలే చోరీ, 1,50,000 వేల రూపాయల నగదు తోపాటు 5 కులాల వెండి దొంగలించ బడిందని బాధి తుడు అప్సర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. వీరు తెలిపిన వివరాల ప్రకారం శుక్రవారం ఉదయం పని నిమిత్తం ఆసిఫాబాద్ వెళ్లగా సుమారు 11 గంటలకు ఇంటి గోద దూకి, తలుపు తాళం పగుల కొట్టి చోరీ చేసినట్లు తెలిపారు. ఈరోజు సాయం త్రం ఇంటికి తిరిగి వచ్చి చూడగా,తాళం పగుల గోట్టి ఉండటంతో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి కౌటాల సీఐ సంతోష్ కుమార్ తో పాటు,సిర్పూర్(టి) ఎస్ఐ, డి.సాగర్ పరిశీలిస్తున్నారు ఎస్సైతో వివరణ కోరగా బాధితుడు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభిస్తామని సిర్పూర్(టి) సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ డి. సాగర్ తెలిపారు.

## నిర్మల్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాపై ఉక్కుపాదం

**అక్రమంగా ఇసుక తీస్తున్న జెసిబి , ఇసుక డంపులు పట్టి వేత**

**సారంగాపూర్, ఏప్రిల్ 03,ప్రజా జ్యోతి** నిర్మల్ జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టేందుకు జిల్లా పోలీస్ శాఖ కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది.జిల్లా ఎస్పీ డా.జి.జానకి షర్మిల ఐపీఎస్ ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి, ఇసుక తవ్వకాలు జరుగుతున్న ప్రదేశాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నమని ఈ నేపథ్యంలో,వంజర్ గ్రామం శివారులో ఉన్న స్వర్ణ వాగు వద్ద అక్రమంగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నట్టు విశ్వసనీయ సమాచారం అందడంతో, జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం మండల పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని దాడి నిర్వహించారు.దాడి సందర్భంగా, అనుమతులు లేకుండా ఇసుక తవ్వుతున్న ఒక జేసీబీ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నారు.అప్పటికే తవ్వి డంప్ చేసిన సుమారు 30 ట్రాక్టర్ల ఇసుక కుప్పలను గుర్తించి వాటిని కూడా స్వాధీనం చేసుకున్నారు.ఈ ఘటనపై సంబంధిత వ్యక్తులపై కేసు నమోదు చేసి, తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నారు.ఎక్కడైనా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా జరుగుతున్నట్టు సమాచారం ఉంటే, ప్రజలు వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఎస్సై శ్రీకాంత్ అన్నారు.

## బ్రిడ్జి నిర్మాణానికి భూమి పూజ



**ఇచ్చోడ, ఏప్రిల్ 3 (ప్రజాజ్యోతి)** ఇచ్చోడ మండలం దుబార్ పేట్ గ్రామంలో బ్రిడ్జి నిర్మాణం పనులను సర్పంచ్ కత్తె ప్రవీణ విఠల్ ప్రారంభిం చారు.దుబార్ పేట్ గ్రామ అభివృద్ధికి మరో ముందడుగు వేస్తూ, గ్రామ సర్పంచ్ బ్రిడ్జి నిర్మాణ కార్యక్ర మాన్ని ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమం గ్రామ ప్రజ లకు, రాకపోకలు సులభం చేయడంతో పాటు అభివృద్ధికి దోహదపడు తుంది. గ్రామ ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న సర్పంచ్‌కి హృదయపూర్వక అభినందనలు తెలియ జేస్తున్నాం అని గ్రామప్రజలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు సలాంరావు, చాకటి పవన్ కుమార్, అలాగే గ్రామ పటేల్ సలాం నాగోరావు, గ్రామ ప్రజలు యువకులు పాల్గొన్నారు.